

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 255 | ఎడిటర్ : బరిగెల శివ | ఆదివారం, 16, ఆగస్టు 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# సాధించిన ఘనతలే.. చాటి చెప్పాలి!




దేశ పురోగతి పూర్తిగా నశించిపోతుంది

జాతీయ జెండా అగౌరవ పడింది

కులానికి కిరీటం వేసి స్వాతంత్ర వేడుకలు అంటున్నారు

నిరుద్యోగాన్ని నిర్మూలిస్తూ అభివృద్ధి పేరును ప్రస్తావించడం అవమానకరం

అత్యాచారాలను ఆపలేనప్పుడు స్వేచ్ఛ అనే హక్కు ఎలా చెప్పగలరు

బలిసినోడికి వర్తించని చట్టం పేదోన్ని పీడించడానికి బలవంత పెడుతుంది

ఆస్తుల దోపిడిని పెంచి పోషిస్తూ జిడిపి అభివృద్ధి అనడం సిగ్గుచేటు

దేశంలో మెల్లమెల్లగా నిర్మూలించబడుతున్న విద్యా వ్యవస్థ

దేశ సమగ్రత కోసం జరుగుతున్న పోరాటం అణిచివేయబడుతుంది

దేశం సాధించిన ఘనతలేమిటి చాటిచెప్పుతున్నవేమిటి


సంవత్సర కాలం పాటు సాధించిన ఘనతలు చెప్పుకోదగినవి కావు

దేశ భవిష్యత్తుకు తీవ్ర ప్రమాదం సంభవించింది

డాక్టర్ బరిగెల శివ









డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)


భారతదేశ వ్యాప్తంగా నిర్వహించబడిన స్వతంత్ర వేడుకల్లో సత్యదూరమైన అంశాలను చాటి చెప్పడంలో ప్రముఖులంతా ప్రాధాన్యతనిచ్చారని డాక్టర్ బరిగెల శివ తనదైన శైలిలో విమర్శించారు.దేశవ్యాప్తంగా 94 వేల పాఠశాలలు మూసివేయడం దేశ అభివృద్ధి ఎలా అవుతుందంటూ ప్రశ్నించారు.దేశవ్యాప్తంగా కొనసాగించబడుతున్న పాఠశాలల్లో తాగునీరు సౌకర్యం విద్యార్థులకు కూర్చోవడానికి బెంచీల సౌకర్యం,సరియైన వాష్ రూమ్స్ లేకపోవడం పాఠశాలలన్నీ మురికిగా ఉంటూ కిటికీలు పగిలిపోవడం ఇవన్నీ గమనిస్తుండగా దేశానికి స్వాతంత్రం వచ్చి 80 సంవత్సరాలు అవుతున్న పిల్లలు చదువుకునే పాఠశాలల్లో మాత్రం కనీసం మౌలిక వసతులు కరువు అవుతూ పాఠశాల విద్యా వ్యవస్థ మూసివేయబడే స్థితికి దేశాన్ని పాలించడం ఊహించని పరిణామంతో పాటు ఎంతో దుర్మార్గం అన్నారు.దేశవ్యాప్తంగా ఏ రాష్ట్రంలో చూసిన విపరీతమైన అత్యాచారాలు పెరిగిపోతున్నాయని దేశంలో అరాచక శక్తుల సంస్థలను పెంచి పోషిస్తూ మారణాయుధాలతో సంచరించే సంస్కృతిని పెంపొందిస్తూ దేశాభివృద్ధికి పాటుపడుతున్నామంటూ డంకాభజన కొట్టుకోవడం వినడానికే విడ్డూరంగా ఉందన్నారు.దేశ సంస్కృతిని కాపాడుతున్నామంటూ ప్రచారం చేసుకుంటూనే సుమారుగా 25 కోట్ల మంది పేద ప్రజలను ఆర్థిక స్థితిగతులు నుండి అభివృద్ధి వైపు నడిపించామని అసత్య ప్రచారాలను చేస్తున్న కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల ఉసురుపోసుకుంటుందన్నారు. 2047 సంవత్సరం నాటికి భారతదేశాన్ని ప్రపంచ దేశాల్లో కెల్లా ప్రథమ దేశంగా తీర్చిదిద్దుతామని ప్రచారం చేయడం బహుళ మోసం అన్నారు.బెంగాల్ రాష్ట్రంలో ఏకంగా జాతీయ జెండాకు బదులు బిజెపి జెండాను ఎగురవేసి జాతీయ గీతాన్ని ఆలపించడం జాతీయవాదాన్ని ఎంతలా అవమాన పరుస్తున్నారో దేశ ప్రజలు గమనించాలన్నారు.150 సంవత్సరాల సందర్భంగా జాతీయ గీతాన్ని అత్యంత ఘనకీర్తిగా నిర్వహించామని ప్రకటించుకుంటున్న పెద్దలంతా జాతీయ గీతాన్ని అవమానకరంగా పాడారని జాతీయగీతం లోని మనోభావాలను దేశ

- మిగతా 2లో..

## సిగ్గు.. సిగ్గు.. సిగ్గు!

స్వాతంత్ర్య దేశంలో ఆలయంలోనే మైనర్ బాలికపై లైంగిక దాడి ఆరోపణలు

ఒకవైపు 80వ స్వాతంత్ర్య వేడుకలు.. మరోవైపు బాలికలకు రక్షణ కరువు!



5

## 80 ఏళ్ల స్వతంత్ర భారతంలోనూ కుల వివక్షా?

ఒక జాతీయ పార్టీ అధ్యక్షుడికే అవమానం జరిగితే.. సామాన్య దళితుడి పరిస్థితి ఏమిటి?





4

## తాండ నుంచి స్టార్ సింగర్‌గా మంగ్లీ..

గాత్రంతో ప్రత్యేక గుర్తింపు, వివాదాలతోనూ వార్తల్లోకి

4



## విధ్వంసం నుంచి వికాసం వైపు

గోల్కొండలో జాతీయ జెండా ఎగురవేసిన సీఎం రేవంత్‌రెడ్డి

32 నెలల్లో దెబ్బతిన్న వ్యవస్థలను గాడిలో పెట్టాం

తెలంగాణ తలసరి ఆదాయం దేశం కంటే 91 శాతం అధికం

రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది

సమన్యాయం, సమానత్వంతో బలమైన ప్రజాస్వామిక భారత్ నిర్మాణం



జై భీమ్ న్యూస్ హైదరాబాద్ (ఆగస్టు 15): గోల్కొండ కోటలో జరిగిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి జాతీయ జెండాను ఎగురవేసి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచ చరిత్రలోనే ఆయుధం లేకుండా అహింసతో స్వాతంత్ర్యం సాధించిన దేశం భారత్ అని, మహాత్మాగాంధీ అహింసా మార్గంతో విజయాన్ని సాధించవచ్చని నిరూపించారని పేర్కొన్నారు. దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అభివృద్ధికి బలమైన పునాదులు వేశారని, హరిత, శ్వేత, నీలి విప్లవాల ద్వారా దేశం వివిధ రంగాల్లో అభివృద్ధి సాధించిందని గుర్తుచేశారు. స్వాతంత్ర్యం జీవనానికి ఆధారమని, దానికి వెల కట్టలేమని గాంధీజీ చెప్పిన మాటలను ప్రస్తావిస్తూ, తెలంగాణను విధ్వంసకర పాలన నుంచి వికాసం వైపు తీసుకెళ్లేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 32 నెలలు పూర్తయ్యాయని, దెబ్బతిన్న వ్యవస్థలను ఒక్కొక్కటిగా గాడిలో పెడుతున్నామని చెప్పారు. సంక్షేమ పథకాలను ఓట్ల కోసం కాకుండా పేదల పట్ల మానవీయ బాధ్యతతో అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. 32 నెలల పాలనలో ప్రభుత్వ కృషి ఫలితాలు కనిపిస్తున్నాయని, తెలంగాణ తలసరి ఆదాయం దేశ తలసరి ఆదాయం కంటే 91 శాతం అధికంగా ఉందని వెల్లడించారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందన్నది తమ ప్రభుత్వ విధానమని, రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్ర అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ భిన్నత్వంలో ఏకత్వం, పరస్పర గౌరవం, దేశభక్తి విలువలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అసమానతలు లేని, శాంతి, సౌభ్రాతృత్వాలతో కూడిన బలమైన ప్రజాస్వామిక భారతదేశ నిర్మాణమే సమరయోధులకు నిజమైన నివాళి అని, ప్రతి పౌరుడికి సమన్యాయం, సమానత్వం, స్వేచ్ఛ అందేలా నవభారత నిర్మాణంలో ప్రతి ఒక్కరూ కర్తవ్యనిష్ఠతో భాగస్వాములు కావాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# చావు ఖర్చుల వివాదం.. అన్నను కత్తెరతో పొడిచి హత్య

**చంపాపేట్ కుమ్మరి బస్తీలో దారుణ ఘటన**





**హైదరాబాద్(జై భీమ్ న్యూస్)**

తండ్రి అంత్యక్రియలు, ఇతర చావు ఖర్చుల విషయంలో అన్నదమ్ముల మధ్య తలెత్తిన వివాదం చివరకు హత్యకు దారితీసింది. తమ్ముడు కత్తెరతో అన్నపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన అన్న ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందిన విషాద ఘటన సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చంపాపేట్ కుమ్మరి బస్తీలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. ముదావత్ వెంకటేష్ (28) గత ఐదేళ్లుగా కుమ్మరి బస్తీలో నివాసముంటూ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తండ్రి మరణం అనంతరం అతని తమ్ముడు శివ (26) కూడా అన్న వద్దకు వచ్చి అక్కడే ఉంటున్నాడు. తండ్రి అంత్యక్రియలు, ఇతర చావు ఖర్చులను వెంకటేష్ భరించగా, తన వాటా డబ్బులు ఇవ్వలేదంటూ శివ తరచూ అన్నతో గొడవపడేవాడని స్థానికులు తెలిపారు. ఈ విషయంలో గతంలోనూ పలుమార్లు అన్నదమ్ముల మధ్య వివాదాలు జరిగినట్లు సమాచారం. ఈ క్రమంలో శనివారం మరోసారి చావు ఖర్చుల విషయమై ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. మాటామాటా పెరగడంతో ఆగ్రహానికి గురైన శివ కత్తెరతో వెంకటేష్‌పై దాడి చేసి అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం. తీవ్రంగా గాయపడిన వెంకటేష్‌ను కుటుంబ సభ్యులు, స్థానికులు ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేయగా మార్గమధ్యలోనే మృతి చెందినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న సరూర్‌నగర్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు శివ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ ఘటనతో చంపాపేట్ కుమ్మరి బస్తీలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# ప్రజలకు న్యాయం.. పోలీసుల బాధ్యత!

**వనపర్తిలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు**
**జాతీయ జెండా ఆవిష్కరించిన ఎస్పీ సునిత రెడ్డి**





**వనపర్తి(జై భీమ్ న్యూస్)**

వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ శ్రీమతి సునిత రెడ్డి, ఐపీఎస్. జాతీయ జెండాను ఆవిష్కరించి, సాయుధ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ సునిత రెడ్డి జిల్లా ప్రజలకు, పోలీసు అధికారులు, సిబ్బందికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి స్ఫూర్తితో ప్రజా సేవలో మరింత అంకితభావంతో పనిచేయాలని పోలీసు సిబ్బందికి సూచించారు. "పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరినీ గౌరవించాలి. బాధితుల సమస్యలను సానుకూలంగా విని, ప్రతి బాధితుడికి న్యాయం అందించాలి" అని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రజల్లో పోలీసులపై నమ్మకాన్ని మరింత పెంచేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. అనంతరం విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించి ప్రశంస పత్రాలను అందజేశారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో మరింత అంకితభావంతో పనిచేయాలని ఆమె సూచించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే సందేశంతో వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా ముగిశాయి.

# సాధించిన "ఘనతలే" చాటిచెప్పాలి










మొదటి పేజీ తరువాయి

పాలన స్థితిగతులకు సరి సమానంగా పోల్చుకొని పాలనలో కొనసాగించిన అభివృద్ధికి సమానంగా జాతీయ గీతాన్ని ఆలపించాల్సి ఉండే అంటూ ప్రస్తావించారు.వెనకబడిపోతున్న దేశాన్ని కాపాడాల్సిన బాధ్యతను దేశ యువత ఎప్పుడో తీసుకున్నారని ప్రతి రాష్ట్రంలో యువత ప్రభావం ఆయా ప్రభుత్వాలపై స్పష్టంగా కనిపిస్తుంది అన్నారు.కేవలం 2025 సంవత్సరం నుండి 2026 సంవత్సరం వరకు జరిగిన అభివృద్ధిని మాత్రమే ప్రస్తావించాల్సి ఉంటుండగా ఏకంగా 1947 సంవత్సరం నుండి నేటి వరకు అభివృద్ధి ప్రస్తావనను తీసుకువస్తూ గడిచిన 12 సంవత్సరాలలో దేశం సాధించిన అభివృద్ధిని చాటి చెప్పాల్సిన కేంద్ర ప్రభుత్వ పెద్దలు అబద్దాలను ఆదర్శవంతంగా ప్రచారం చేస్తున్నారని దేశ ప్రజలు వాటిని ఏమాత్రం నమ్మే పరిస్థితిలో లేరన్నారు.ఆర్థిక సంపదనంతా దోచుకుంటూ వాటి భారాన్ని పేద ప్రజలపై వేస్తున్న కేంద్ర ప్రభుత్వం దేశ ఆర్థిక స్థితిగతులపై జరుగుతున్న ఆర్థిక కుంభకోణాలను దేశ ప్రజలకు ఏ విధంగా వివరిస్తారో చెప్పాల్సిన అవసరం ఉందన్నారు.రైతులను మోసం చేస్తూ పేద ప్రజలపై జీఎస్టీ భారాన్ని పెంచుతూ దేశ అభివృద్ధి నంతా బడా బాబులకు దోచిపెడుతూ స్వాతంత్ర వేడుకలను సగౌరవంగా జరుపుకున్నామని భజన చేసుకోవడం భరించరని మోసం అన్నారు.దేశాన్ని మోసగిస్తూ దేశ ప్రజలను మోసగిస్తూ స్వాతంత్ర సమరయోధులను స్వాతంత్ర్య ఉద్యమ వీరులను,స్వాతంత్ర పోరాటంలో ప్రాణాలు విడిచిన అమరులను వాళ్ల త్యాగాలను స్వాతంత్ర వేడుకల్లో ప్రస్తావిస్తూ పూర్తిస్థాయిలో అవమాన పరచాలని మండిపడ్డారు.దేశాన్ని పాలిస్తున్నది ఎవరంటూ దేశ ప్రజలకు ఎక్కడలేని అనుమానాలు కలుగుతున్నాయన్నారు.కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానపరమైన నిర్ణయాలు దేశంలోని అన్ని రాష్ట్రాలను పాడు చేస్తున్నాయని కేంద్రం పాటించమంటున్న విధానాలతో రాష్ట్రాలు అభివృద్ధికి నోచుకోకుండా కుంటుపడిపోతున్నాయని విమర్శించారు.

**అభివృద్ధికి నోచుకోని....ఆచరణ.....**

దేశ అభివృద్ధి అంటే ప్రధానంగా గుర్తుకొచ్చేది విద్యాభివృద్ధి అంటూ గుర్తు చేశారు.దేశం అభివృద్ధి పథంలో నడవాలి అంటే విద్యా వ్యవస్థ ఎంతో ఉన్నతమైన స్థితిలో అభివృద్ధి చెందాల్సి ఉండెనని అలాంటి పరిస్థితులను వెనక్కి నెట్టుకుంటూ 12 సంవత్సరాల చరిత్రలో విద్యా వ్యవస్థ ఎప్పుడు లేనంత వెనకబడిపోయిందని విద్యా వ్యవస్థను పునర్నిర్మించడం ద్వారా మాత్రమే దేశాభివృద్ధి దేశ పురోగతి సాధ్యమవుతుందన్నది దేశపాలకులు గుర్తించాలన్నారు.బ్రిటిష్ పాలకుల నుండి దేశాన్ని రక్షించుకోవడం కోసం స్వాతంత్ర్యాన్ని తెచ్చుకోవడం కోసం నాటి మహనీయులు ఏ విధంగా పోరాటాలు చేశారో అదే తరహాలో నేటి యువత దేశాన్ని కాపాడుకోవడం కోసం బాధ్యతను కనపరుస్తున్నారని అలాంటి సందర్భంలోనే ఊహించని అవమానాలను ఆచరణ రూపంలో ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.అభివృద్ధి కోసం పాటుపడుతున్న మేధావి యువతపై అన్ని వర్గాల ప్రతినిధులు తీవ్ర విమర్శలు గుప్పిస్తుంటే దేశంలో ప్రతి రాష్ట్రంలోని యువత ఐక్యతను కనపరుస్తూ దేశ రక్షణ కోసం పాటుపడుతున్నారని అభినందించారు.దేశ అభివృద్ధిని ఎక్కడ ఆచరణలో చూపించని కేంద్ర ప్రభుత్వం ప్రతి విషయంలో వైఫల్యాలను కనపరుస్తూ దేశం పట్ల దేశ అభివృద్ధి పట్ల కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ఆచరణల పట్ల ప్రజా విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోతున్నట్లు ప్రస్తావించారు.దేశ అభివృద్ధి మరుగున పడడానికి దేశాన్ని దోచుకుంటున్న పెద్ద పెద్ద వ్యాపారస్తులే కారణమని ముందస్తుగా దేశ అభివృద్ధికి తీవ్రస్థాయిలో ఆటంకాలు సృష్టిస్తున్న అలాంటి పెద్ద మనుషులను వాళ్ల వ్యాపారాలను పూర్తిస్థాయిలో నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు.కేంద్ర ప్రభుత్వ పెద్దలు అభివృద్ధి అనే పదం ప్రస్తావించిన ప్రతి సందర్భంలో దేశం వెనుకబాటుతనం దేశ ప్రజలకు కొట్టొచ్చినట్టుగా కనిపిస్తూ దేశ పాలకులు ప్రస్తావిస్తున్న మాటలకు వ్యతిరేక ధ్వనులు దేశ ప్రజల చెవులు దగ్గుర్లు పెట్టేలా వినిపిస్తున్నాయని దేశ ప్రజల ఆందోళన కేంద్ర ప్రభుత్వానికి జ్ఞాపకం చేశారు.ప్రతి రాష్ట్రంలోని ఆదాయము, నిధుల సేకరణ ఆయా రాష్ట్రాల పాలనకు సరి సమానంగా కేటాయించబడుతున్న నిధుల పంపకాలలో పారదర్శక పరిపాలన కొనసాగించగలిగినట్లయితే రాష్ట్రాల అభివృద్ధి దేశ అభివృద్ధి సాఫీగా సాగుతుందని గుర్తు చేశారు.ప్రతి రాష్ట్రంలోని ప్రజలందరినీ సోమరిపోతులను తయారుచేసి పనులు చేసుకునివ్వకుండా ఉచిత పథకాలు కల్పిస్తామంటూ అంటూ హామీలు ఇచ్చి అభివృద్ధి పేరుకు అర్థం లేకుండా చేసేస్తున్నారని మండిపడ్డారు.సంక్షేమ పథకాలకు అర్హులు ఎవరో అనర్హులెవరో ప్రభుత్వాలే గుర్తించకపోతే ఎలా అంటూ నిలదీశారు.ఉచిత సంక్షేమ పథకాలకు బదులు ప్రజలకు పనులు చేసుకోవడానికి పరికరాలతో కూడిన పనిముట్ల సౌకర్యాలు కల్పించగలిగితే ప్రజలు ప్రభుత్వాలపై ఆధారపడాల్సిన అవసరం ఉండన్నారు.ఏ రాష్ట్రంలోనైనా ప్రభుత్వాలపై గాని వ్యవస్థలపై గాని ఆధారపడకుండా సొంతగా పనులు చేసుకుంటూ శ్రమ పడుతూ కార్మిక లోకానికి ఆదర్శంగా నిలుస్తున్నది మాత్రం చేనేత కార్మికులేనని వాళ్లతో పాటు రోజువారి కార్మికులు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నారని గర్వపడ్డారు.కూలి పనితో సంపాదించుకున్న డబ్బులతో కుటుంబాలను పోషించుకోగల గొప్ప సాహసవంతమైన జీవితాలను గడపడం రైతులకు చేనేత కార్మికులకు,రోజువారీ కూలీ కార్మికులకు మాత్రమే సాధ్యమవుతుందని వాళ్లతో పాటు చాలీచాలని జీతాలతో పని చేస్తున్న సన్నకారు ఉద్యోగులను అభివృద్ధి పథంలోనికి నడిపించగలిగితే దేశాభివృద్ధి అనుకోని విధంగా సాధ్యమయ్యే అవకాశాలు మెరుగ్గా ఉన్నాయన్నారు.12 సంవత్సరాలుగా దేశాన్ని దేశ పాలకులను ఆయా రాష్ట్రాలను ఆయా రాష్ట్రాల పాలకులను పట్టిపీడిస్తున్నది మాత్రం నిరుద్యోగ నిర్మూలనేని ప్రతి రాష్ట్రంలో నిరుద్యోగుల కోసం ప్రభుత్వ వ్యవస్థలలోని ఖాళీలను అన్నిటిని భర్తీ చేస్తుండడం వల్ల నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పిస్తూ ప్రభుత్వ వ్యవస్థలను కాపాడుకునే క్రమంలో అన్ని రాష్ట్రాల భవిష్యత్తును దేశ భవిష్యత్తును కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.నిజాయితీని కనపరచడంలో మొఖం చాటేస్తూ అభివృద్ధిని ప్రస్తావిస్తున్న ప్రతి ఒక్కరూ జాతీయవాదాన్ని అపహస్యం చేస్తున్నారని గుర్తుపెట్టుకోవాలన్నారు.అభివృద్ధిని ఆచరణలో కొనసాగించినప్పుడు మాత్రమే స్వాతంత్ర భారతదేశానికి చక్కని నిర్వచనాన్ని కల్పించిన వాళ్ళమవుతామని ప్రత్యక్షంగా గుర్తు చేశారు.అన్నిటికన్నా ముఖ్యంగా దేశంలో ప్రజలు స్వేచ్ఛగా జీవించలేకపోతున్నారని ప్రతి రాష్ట్రంలో ప్రజల మధ్య అసమానతలను, రాగద్వేషాలను, మతాలను, రెచ్చగొడుతూ ప్రజల మధ్య విద్వేషాలతో రెచ్చగొడుతున్న దౌర్జన్యాలన్నీ పూర్తిగా నిర్మూలించబడాలని అదే సందర్భంలో స్వేచ్ఛ సమానత్వం సంరక్షణ మానవత్వ విలువలకు పెద్దపీట వేస్తూ దేశ ప్రజలను అన్ని విధాల సమాన హక్కులతో జీవించగలిగేలా అభివృద్ధి చేయగలిగినప్పుడే స్వాతంత్ర వేడుకల్లో పాల్గొంటూ జాతీయ గీతాన్ని ఆలపించాలని ఒక్కానించి చెప్పారు.

# సమాన హక్కులు, గౌరవం, అవకాశాలు లభించే సమాజమే నిజమైన స్వాతంత్ర్యం






**పరిశోధక విద్యార్థుల ఆధ్వర్యంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు**

**కేయూ క్యాంపస్, 15 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయం పరిశోధక విద్యార్థుల ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం విశ్వవిద్యాలయ స్కాలర్స్ హాస్టల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశోధక విద్యార్థి కలకొట్ల సుమన్ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ఎంతోమంది స్వాతంత్ర్య సమరయోధులు తమ ప్రాణాలను త్యాగం చేశారని గుర్తు చేశారు. సమాజంలో అన్యాయం కనిపించినప్పుడు ప్రశ్నించడం, అవకాశాలు లేని వారికి అండగా నిలబడటం, కులం, మతం, ప్రాంతం పేరుతో ప్రజలను విభజించకుండా సమానత్వం కోసం నిలబడటమే నిజమైన దేశభక్తి అని అన్నారు. ఈ తరం యువత ఆలోచనా విధానం మారితే దేశం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. కేవలం ఉద్యోగం కోసం మాత్రమే కాకుండా సమాజం కోసం కూడా ఆలోచించాలని, విద్యను పొందడంతో పాటు ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. రాజ్యాంగ విలువలను గౌరవిస్తూ ప్రతి మనిషికి సమాన హక్కులు, గౌరవం, అవకాశాలు లభించే సమాజ నిర్మాణానికి యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయులను స్మరించుకోవడం మాత్రమే కాకుండా వారు కలలుగన్న సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువలతో కూడిన భారతదేశాన్ని నిర్మించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో స్కాలర్స్ హాస్టల్ జాయింట్ డైరెక్టర్, పరిశోధక విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సుమతి రెడ్డి ఐపీఎస్ సొంత గ్రామం కలుగోట్లలో 200 మీటర్ల జాతీయ జెండాతో ఘన వేడుకలు

**కేజీబీవీ బాలికలు, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనమైన దేశభక్తి ప్రదర్శన**

**కలుగోట్ల(జై భీమ్ న్యూస్)**

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ సుమతి రెడ్డి ఐపీఎస్ సొంత గ్రామమైన కలుగోట్లలో దేశభక్తిని చాటే అద్భుతమైన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేజీబీవీ బాలికలు, గ్రామస్తులు కలిసి 200 మీటర్ల పొడవైన జాతీయ జెండాను చేతబట్టి గ్రామంలో నిర్వహించిన భారీ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కేజీబీవీ బాలికలను గ్రామ సమాజంతో మరింతగా మమేకం చేయడం, విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసం, దేశభక్తి, సామాజిక బాధ్యతను పెంపొందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలికలు ఎంతో ఉత్సాహంగా, ఆనందంగా పాల్గొని గ్రామస్తులతో కలిసి జాతీయ జెండాను చేతబట్టి ముందుకు సాగారు. చేతుల్లో త్రివర్ణ పతాకం.. గుండెల్లో దేశభక్తి.. ముఖాల్లో ఆనందం.. అడుగుల్లో ఆత్మవిశ్వాసం కనిపించిన ఈ దృశ్యాలు కలుగోట్ల గ్రామాన్ని దేశభక్తి వాతావరణంలో ముంచెత్తాయి. బాలికలు, గ్రామస్తులు కలిసి ఒకే జాతీయ జెండా కింద నడవడం గ్రామ ఐక్యతకు ప్రతీకగా నిలిచింది.

**సొంత గ్రామంలో సుమతి రెడ్డి ఐపీఎస్ పేరుతో ప్రత్యేక వేడుక**

మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ సుమతి రెడ్డి ఐపీఎస్‌కు స్వగ్రామమైన కలుగోట్లతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేస్తూ, ఆమె పేరును ప్రస్తావిస్తూ గ్రామంలో ఈ ప్రత్యేక స్వాతంత్ర్య వేడుకను నిర్వహించడం విశేషంగా నిలిచింది. సుమతి రెడ్డి ఐపీఎస్ ఈ కార్యక్రమానికి హాజరు కాలేదు. అయితే ఆమె సొంత గ్రామంలో ఆమె పేరు మీదుగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించడం గ్రామస్తుల్లో ప్రత్యేక ఆనందాన్ని కలిగించింది. తన గ్రామానికి చెందిన ఒక మహిళ ఉన్నత స్థాయిలో పోలీస్ అధికారిగా ఎదగడం గ్రామంలోని బాలికలకు కూడా ఒక గొప్ప స్ఫూర్తిగా నిలుస్తోంది.




**బాలికలకు స్ఫూర్తిగా ఒక విజయగాథ**

సాధారణ గ్రామం నుంచి ఎదిగి ఉన్నత స్థాయి పోలీస్ అధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సుమతి రెడ్డి ఐపీఎస్ ప్రయాణం గ్రామంలోని విద్యార్థినులకు "మనమూ ఉన్నత స్థాయికి ఎదగగలం" అనే ఆత్మవిశ్వాసాన్ని నింపేలా ఉంది. అందుకే ఆమె సొంత గ్రామంలో నిర్వహించిన ఈ వేడుకకు మరింత ప్రత్యేకత ఏర్పడింది. కేజీబీవీ బాలికలు జాతీయ జెండాను చేతబట్టి గ్రామస్తులతో కలిసి ముందుకు సాగడం విద్య, మహిళా సాధికారత, దేశభక్తి, గ్రామ ఐక్యతకు ప్రతీకగా నిలిచింది. 200 మీటర్ల జాతీయ జెండాతో గ్రామ రహదారులపై సాగిన ప్రదర్శనలో బాలికల ఉత్సాహం, గ్రామస్తుల భాగస్వామ్యం ప్రత్యేకంగా కనిపించింది. ఒకే జెండా కింద చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ కలిసి నడవడం స్వాతంత్ర్య దినోత్సవ స్ఫూర్తిని మరింత పెంచింది. ఈ కార్యక్రమం కేవలం జాతీయ జెండా ప్రదర్శనగా కాకుండా గ్రామంతో కేజీబీవీ బాలికలను అనుసంధానం చేసే ప్రయత్నంగా, బాలికల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచే కార్యక్రమంగా, రేపటి తరానికి స్ఫూర్తినిచ్చే వేడుకగా నిలిచింది.

**ఒక గ్రామం.. ఒక జెండా.. ఒక స్ఫూర్తి**

సుమతి రెడ్డి ఐపీఎస్ సొంత గ్రామమైన కలుగోట్లలో జరిగిన ఈ వేడుక ఒక ప్రత్యేక సందేశాన్ని ఇచ్చింది. ఈరోజు జాతీయ జెండాను చేతబట్టి నడిచిన ఈ బాలికలే.. రేపటి సమాజానికి నాయకత్వం వహించాలి. గ్రామం నుంచి ప్రపంచ స్థాయికి ఎదగాలనే కలలు కనాలి. విద్యతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవాలి. దేశం కోసం బాధ్యతగల పౌరులుగా ఎదగాలి. కలుగోట్లలో 200 మీటర్ల జాతీయ జెండాతో జరిగిన ఈ ఘన ప్రదర్శన.. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఒక చిరస్మరణీయ ఘట్టంగా నిలిచింది.

# ప్రముఖులతో ఫొటోలు.. చేతిలో ఫేక్ ఐడీ..

**డీఐజీ అంటూ భార్యాభర్తల లక్షల దందా!**



**మేడ్చల్ (జై భీమ్ న్యూస్)**

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పోలీసు శాఖలో ఉన్నతాధికారులమంటూ అమాయక ప్రజలను నమ్మించి లక్షల రూపాయలు వసూలు చేస్తున్న భార్యాభర్తలను కీసర పోలీసులు అరెస్ట్ చేశారు. శ్రీధర్, నందిని అనే నిందితులు తాము ఇంటెలిజెన్స్ డీఐజీగా పనిచేస్తున్నామని చెప్పుకుంటూ పలువురిని మోసం చేసినట్లు పోలీసులు గుర్తించారు. పోలీసుల వివరాల ప్రకారం.. నిందితులు నకిలీ పోలీసు గుర్తింపు కార్డులను తయారు చేసుకుని వాటిని చూపిస్తూ తాము ఉన్నతాధికారులమని నమ్మించేవారు. అంతేకాకుండా ప్రముఖ వ్యక్తులతో కలిసి దిగినట్లుగా కనిపించే మార్ఫింగ్ ఫొటోలను చూపిస్తూ తమకు ఉన్నతస్థాయి పరిచయాలు ఉన్నాయని బాధితులను నమ్మించేవారు. ఈ పరిచయాలను అడ్డుపెట్టుకుని వివిధ పనులు చేయిస్తామంటూ పలువురి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. కొంతకాలంగా కొనసాగుతున్న ఈ మోసాలపై అనుమానం వచ్చిన బాధితులు కీసర పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదుల ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితుల అసలు బాగోతాన్ని బయటపెట్టారు. నకిలీ పోలీసు గుర్తింపు కార్డులు, మార్ఫింగ్ ఫొటోలను ఉపయోగిస్తూ పోలీసు అధికారులుగా చలామణి అవుతున్న శ్రీధర్, నందినిని పోలీసులు అరెస్ట్ చేశారు. వీరు ఇప్పటివరకు ఎంతమందిని మోసం చేశారు? ఎంత మొత్తంలో డబ్బులు వసూలు చేశారు? ఇంకా ఎవరైనా బాధితులు ఉన్నారా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పోలీసుల పేరుతో ఎవరైనా అనుమానాస్పదంగా డబ్బులు డిమాండ్ చేస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని అధికారులు ప్రజలకు సూచించారు.

# విలియంకేరి హైస్కూల్లో స్వతంత్ర్య దినోత్సవ వేడుకలు

**స్వాతంత్ర్య భావాలను ప్రతి ఒక్కరు అనువదించుకోవాలి.**
**విలియం కేరి ఆదర్శ భావాలను కొనసాగించాలి.**
**దేశ స్వాతంత్ర్యం దేశ సమానత్వానికి సారూప్యం.**
**దేశవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు పెంపొందించబడాలి.**
**డాక్టర్ కృష్ణ ఫర్ రూబెన్,టి విజయ్ స్వరూప్.**

**హన్మకొండ జై భీమ్ న్యూస్.:-**

హన్మకొండలోని సెంటినరీ బాప్టిస్ట్ సంఘం ఆధ్వర్యంలో కొనసాగించబడుతున్న విలియం కేరి హై స్కూల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడినయని స్కూల్ నిర్వాహకులు డేనియల్ బెల్తేజర్ జాయింట్ సెక్రటరీ ఎన్ జాన్సన్ ప్రసాద్ తెలిపారు.స్వతంత్ర్య వేడుకలకు ముఖ్య అతిథులుగా సంఘ అధ్యక్షులు డాక్టర్ టి క్రిష్టోఫర్ రూబెన్,సెక్రటరీ టి విజయ స్వరూప్,సంఘ సహాయకాపరులు రెవరెండ్ మైకేల్, రెవరెండ్ మోజెస్ ముఖ్య అతిథులుగా పాల్గొనగా ప్రిన్సిపాల్ టీఎం ప్రభాకర్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ జీ ప్రేమ్ చంద్రశేఖర్ కార్యక్రమము ముఖ్యులుగా పాల్గొన్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా జండా వందన కార్యక్రమంలో జాతీయ జెండాను సంఘ ప్రెసిడెంట్ డాక్టర్ టి.క్రిస్టోఫర్ ఎగరవేశారు.తదనంతరం సంఘ పెద్దలు మాట్లాడుతూ దేశంలో అడుగంటి పోతున్న మానవత్వ విలువలను వెతికి కాపాడుకోవడం కోసం స్వాతంత్ర్య ఉద్యమ పోరాట భావాలు ఎంతో స్ఫూర్తినిస్తాయని తెలిపారు.జాతీయ జెండాను ఎగరవేయడంలో మహనీయుల త్యాగాలను జ్ఞాపకం చేసుకోవడంతో పాటు వాళ్లు కొనసాగించిన సేవా భావాలను స్ఫూర్తిగా తీసుకొని పేద ప్రజలకు అండగా నిలుస్తూ సేవలు చేయాలని పిలుపునిచ్చారు.విలియం కేరి ఉన్నత పాఠశాలలో వందలాదిమంది పేద విద్యార్థులు ప్రతి సంవత్సరం ఉచితంగా నాణ్యమైన విద్యను పొందుకుంటున్నారని పాఠశాల నిర్వహణకు సహకరిస్తున్న సెంటినరీ బాప్టిస్ట్ సంఘాన్ని అభినందించాలన్నారు.త్రి నగర క్రైస్తవ సమాజం సేవా కార్యక్రమాలకు ఆదర్శంగా నిలుస్తుందని అభినందించారు.ప్రధానంగా క్రైస్తవ యువత సేవా కార్యక్రమాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు.సమాజంలో గుర్తింపుతో సంబంధం లేకుండా మానవత్వంతో కూడిన సమానత్వాన్ని చాటుకోవడం కోసం పేదలకు ఎక్కువస్థాయిలో సేవలందించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ముఖ్యులతోపాటు హైస్కూల్ విద్యార్థులు 400 మంది పాల్గొన్నట్లు పాఠశాల ఇంచార్జ్ తెలియజేశారు.



# విద్యారణ్యపురి హాస్టల్‌లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**వరంగల్, 15 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

కాకతీయ యూనివర్సిటీ విద్యారణ్యపురి హాస్టల్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఫార్మసీ విభాగానికి చెందిన బీ.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, పీహెచ్‌డీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆచార్య డా. గాదే సమ్మయ్య హాజరయ్యారు. తొలుత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మహాత్మా గాంధీ, నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటాలకు



పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జెండాకు వందనం చేశారు. ఈ సందర్భంగా ఆచార్య డా. గాదే సమ్మయ్య మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, నేతాజీ సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్, అల్లూరి సీతారామరాజు తదితర మహనీయులు చేసిన త్యాగాలు, పోరాటాలు చిరస్మరణీయమని అన్నారు. వారి త్యాగాల ఫలితంగానే నేడు దేశ ప్రజలు స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి విలువలను అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని, రాజ్యాంగ విలువలను గౌరవిస్తూ సమసమాజ నిర్మాణానికి కృషి చేయాలని ఆయన సూచించారు. మహనీయుల ఆశయాలను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని, తల్లిదండ్రులకు, కాకతీయ యూనివర్సిటీకి మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు దేశభక్తి నినాదాలు చేస్తూ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు. కార్యక్రమం దేశభక్తి వాతావరణంలో ఘనంగా ముగిసింది.

# రేషన్ కార్డుల పంపిణీతో పేద కుటుంబాలకు భరోసా

**పేద కుటుంబాలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం : ఎమ్మెల్యే నాయిని**



**హనుమకొండ, 15 ఆగస్ట్ 2026 (జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవన్‌లో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో కలిసి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయిని మాట్లాడుతూ గత పదేళ్లలో పేదలకు కొత్త రేషన్ కార్డులు, ఇళ్లు, సంక్షేమ పథకాలు అందని పరిస్థితి నెలకొందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు అందించడం ద్వారా పేద కుటుంబాలకు భరోసా కల్పిస్తోందని తెలిపారు. కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లు నమోదు కావడంతో అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరువవుతాయని అన్నారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, ఉచిత విద్యుత్ తదితర పథకాలతో పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో తొలి విడతగా 3,500, రెండో విడతగా మరో 2,000 ఇళ్ల మంజూరుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. హనుమకొండ జిల్లా అభివృద్ధికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సహకారం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మార్గదర్శకత్వం అందిస్తున్నారని నాయిని పేర్కొన్నారు. మిగిలిన హామీలను కూడా దశలవారీగా అమలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్ రవి, ఆర్డీఓ వెంకటేష్, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE సమస్యలపై సమరంగా Jai Bheem STRUGGLE FOR JUSTICE TV సామాన్యుడి ఆయుధంగా

# కిట్స్ వరంగల్‌లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**ఏఐ, క్వాంటం, భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనేలా విద్యార్థులు సిద్ధం కావాలి: ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి**





**వరంగల్, 15 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

కిట్స్ వరంగల్ ఇంజనీరింగ్ కళాశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో శనివారం ఉదయం 8 గంటలకు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి జాతీయ జెండాను ఎగురవేసి, జాతీయ పతాకానికి వందనం చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య పోరాట చరిత్ర, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, అంకితభావాన్ని విద్యార్థులకు వివరించారు. స్వాతంత్ర్యం మనకు వారసత్వంగా లభించిన బహుమతి మాత్రమే కాదని, దానిని కాపాడుతూ దేశ ప్రగతికి తమ వంతు బాధ్యతను నిర్వర్తించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం టెక్నాలజీ, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, వీఎల్ఎస్ఐ డిజైన్ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాల్లో విద్యార్థులకు అవసరమైన ఉపాధి నైపుణ్యాలను పెంపొందించేందుకు కిట్స్ వరంగల్‌లో ఎన్ఈపీ–2020 పాఠ్యప్రణాళికను అమలు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో జ్ఞానం, నైపుణ్యాలు, సామర్థ్యాలు, సానుకూల వైఖరిని పెంపొందించడం ద్వారా వారి సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. 'వికసిత్ భారత్–2047' లక్ష్య సాధనలో విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు. స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక, సహపాఠ్య కార్యక్రమాలు విద్యార్థుల్లో దేశభక్తి, నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకతను పెంపొందిస్తున్నాయని అన్నారు. ఆవిష్కరణ ఆలోచనలను ప్రోత్సహించడం, ఇంక్యుబేషన్ కార్యక్రమాలు నిర్వహించడం, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు కలిగిన ఇంజనీర్లను, స్టార్టప్‌లను తయారు చేయడం తమ లక్ష్యమని వివరించారు. 2030 నాటికి విద్యార్థులను ఏఐ–రెడీ, క్వాంటం–రెడీ, ఫ్యూచర్–రెడీ, నేషన్–రెడీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ప్రిన్సిపాల్ తెలిపారు. సాంకేతిక నైపుణ్యాలతో పాటు నైతిక విలువలను అలవరచుకుని మంచి పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ, ఎండీఎఫ్, పీఎంసీ, ఎన్ఎస్ఎస్, లిటరరీ క్లబ్‌ల ఆధ్వర్యంలో వ్యాసరచన, వక్తృత్వం, పోస్టర్ డిజైన్, కవిత్వం, చర్చ, లలిత కళలు, గానం, శాస్త్రీయ, ఉపశాస్త్రీయ, గర్బా, పంజాబీ నృత్య పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రిన్సిపాల్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో 120 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొని కవాతు నిర్వహించారు. దేశభక్తి గీతాలు, నృత్యాలు, పద్యాలతో వేడుకలు ఉత్సాహభరితంగా సాగాయి. విద్యార్థులు దేశ నిర్మాణం పట్ల గర్వం, అభిరుచి, దేశభక్తిని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. కోమల్ రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రొఫెసర్ పి. రమేష్ రెడ్డి, ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ ఎం. రణధీర్ కుమార్, హెడ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డా. ఎం. శ్రీనివాస రెడ్డి, డీన్ అకడమిక్ అఫైర్స్ ప్రొఫెసర్ ఎస్. నరసింహ రెడ్డి, డీన్ స్టూడెంట్ అఫైర్స్ ప్రొఫెసర్ కె. శ్రీధర్, వివిధ విభాగాల డీన్లు, విభాగాధిపతులు, ప్రొఫెసర్లు ఎల్. సుధీర్ రెడ్డి, సి. వెంకటేష్ (సీఓఈ), పి. నిరంజన్ రెడ్డి (హెడ్, సీఎస్ఈ), జి. రఘోతం రెడ్డి (హెడ్, ఈసీఈ), హెడ్ ఐ2ఆర్ఈ ప్రొఫెసర్ కె. రాజనరేందర్ రెడ్డి, ప్రొ. యు.ఎస్. బాల్‌రాజ్, అసోసియేట్ ప్రొఫెసర్ ఓ పీఆర్ఓ డా. డి. ప్రభాకర చారి, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థి ప్రతినిధులు, కిట్స్ వరంగల్ విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# హసన్‌పర్తి మండలంలో ప్రతి సోమవారం ప్రజావాణి

**హసన్‌పర్తి, 15 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**



ప్రభుత్వ ఆదేశాల మేరకు హసన్‌పర్తి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) సుమనా వాణి తెలిపారు. ఈ నెల 17వ తేదీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయిలోని వివిధ శాఖలకు చెందిన అధికారులు అందుబాటులో ఉండి ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులు, సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించనున్నారు. ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులు, ప్రభుత్వ సేవలకు సంబంధించిన వినతులను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందేందుకు ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. ప్రజావాణి కార్యక్రమానికి తహసీల్దార్, మండల విద్యాశాఖ అధికారి, మండల వ్యవసాయ అధికారి, పశు వైద్య, వైద్య, ఉద్యానవన, మత్స్య, సంక్షేమ, పంచాయతీ, గృహ నిర్మాణ, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్అండ్‌బీ, నీటిపారుదల, విద్యుత్ తదితర శాఖల అధికారులు హాజరుకానున్నారు. మండల ప్రజలు తమ ఫిర్యాదులు, గ్రీవెన్సుల పరిష్కారం కోసం ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటలోపు మండల కార్యాలయానికి వచ్చి ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తులు సమర్పించాలని ఎంపీడీఓ సుమనా వాణి విజ్ఞప్తి చేశారు.

# తాండ నుంచి స్టార్ సింగర్‌గా మంగ్లీ..

**గాత్రంతో ప్రత్యేక గుర్తింపు, వివాదాలతోనూ వార్తల్లోకి**

**హైదరాబాద్ (జై భీమ్ న్యూస్)**

పల్లె పాట వినిపిస్తే చాలు.. ఆ గాత్రం మంగ్లీదే అని గుర్తుపట్టే స్థాయికి ఎదిగిన ప్రముఖ గాయని సత్యవతి రాథోడ్ (మంగ్లీ) ప్రయాణం స్ఫూర్తిదాయకంగా నిలిచింది. సినిమా నేపథ్యం లేని కుటుంబం నుంచి వచ్చిన ఆమె.. ఎన్నో కష్టాలను అధిగమించి జానపద గాయనిగా ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. అయితే కెరీర్‌లో విజయాలతో పాటు పలు వివాదాలు కూడా ఆమెను వెంటాడాయి.

**చిన్న తాండ నుంచి సంగీత ప్రపంచం వరకు..**

అనంతపురం జిల్లా గుత్తి మండలం బచ్చినేపల్లి తాండలో బంజారా కుటుంబంలో జన్మించిన మంగ్లీకి చిన్నతనం నుంచే పాటలపై ఆసక్తి ఏర్పడింది. కుటుంబ ఆర్థిక పరిస్థితులు సవాలుగా ఉన్నప్పటికీ సంగీతంపై ఉన్న అభిరుచిని మాత్రం ఆమె వదులుకోలేదు. తాండలో ఐదో తరగతి వరకు చదివిన అనంతరం బాలికల ఉన్నత పాఠశాలలో విద్యను కొనసాగించారు. ఆమె సంగీత ప్రతిభను గుర్తించిన రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ సహకారం ఆమె జీవితంలో కీలకంగా మారింది. తిరుపతికి వెళ్లి సంగీత శిక్షణ పొందిన మంగ్లీ.. కర్ణాటక సంగీతాన్ని అభ్యసించడంతో పాటు శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీలో సంగీతం, నృత్య విభాగంలో డిప్లొమా పూర్తి చేశారు.

**'తీన్మార్'తో వచ్చిన భారీ గుర్తింపు**

మంగ్లీ కెరీర్‌కు టెలివిజన్ మంచి మలుపు ఇచ్చింది. 'తీన్మార్' జానపద కార్యక్రమం ద్వారా ఆమె గాత్రం విస్తృత ప్రేక్షకులకు చేరింది. తెలంగాణ యాస, పల్లె పదాలు, ఉత్సాహభరితమైన గానం ఆమెను ప్రత్యేకంగా నిలబెట్టాయి. ఆ తర్వాత సినిమాలు, ప్రత్యేక గీతాలు, పండుగ పాటలతో ఆమెకు మరింత ఆదరణ లభించింది. బతుకమ్మ, బోనాలు, శివరాత్రి వంటి సందర్భాల్లో ఆమె పాడిన పాటలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. జానపద సంగీతాన్ని ఆధునిక బాణీలతో మేళవిస్తూ తనకంటూ ప్రత్యేక శైలిని ఏర్పరుచుకున్నారు.





**వివాదాల్లోనూ మంగ్లీ పేరు**

మంగ్లీ కెరీర్‌లో విజయాలతో పాటు కొన్ని వివాదాలు కూడా చోటుచేసుకున్నాయి. గతంలో చేవెళ్ల సమీపంలోని ఓ రిసార్ట్‌లో జరిగిన పుట్టినరోజు వేడుకలకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసినట్టు వార్తలు వచ్చాయి. ఈ వ్యవహారంలో తనకు డ్రగ్స్‌తో ఎలాంటి సంబంధం లేదని మంగ్లీ వివరణ ఇచ్చినట్లు సమాచారం. అలాగే ఆమె పాడిన 'సర్కే చునార్ తేరి సర్కే' పాటపై అభ్యంతరాలు వ్యక్తం కావడంతో ఆ పాటను తొలగించి, జరిగిన ఘటనపై ఆమె క్షమాపణలు చెప్పినట్లు అప్పట్లో వార్తలు వెలువడ్డాయి. ఇక మంగ్లీ పేరు ఉపయోగించుకుని కొందరు వ్యక్తులు మోసాలకు పాల్పడ్డారనే ఆరోపణలు కూడా వెలుగులోకి వచ్చాయి. ఈ వ్యవహారంలో ఆమె తమ్ముడు శివ, మధు అనే వ్యక్తులపై సుమారు 100 మందిని మోసం చేశారనే ఆరోపణలు వచ్చినట్లు సమాచారం. ఈ అంశం కోర్టు పరిధిలో ఉన్నందున ఆరోపణలు నిర్ధారణ అయ్యే వరకు వాటిని ఆరోపణలుగానే చూడాల్సి ఉంటుంది.

**కష్టాలను దాటి ప్రత్యేక స్థానం**

చిన్న తాండలో మొదలైన మంగ్లీ గాత్ర ప్రయాణం.. టెలివిజన్ నుంచి సినిమా సంగీతం వరకు కొనసాగి ఆమెను తెలుగు రాష్ట్రాల్లో గుర్తింపు పొందిన గాయనిగా నిలబెట్టింది. పరిమిత అవకాశాలు, ఆర్థిక ఇబ్బందులను అధిగమించి తన ప్రతిభతో ఎదిగిన ఆమె ప్రయాణం ఒకవైపు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుండగా.. మరోవైపు ఎదురైన వివాదాలు ఆమె కెరీర్‌లో చర్చనీయాంశంగా మారాయి.

# వరంగల్ డీఐజీ కార్యాలయంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**వరంగల్, 15 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ డీఐజీ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలో జోన్–4 డీఐజీ ఎన్. శ్వేత, ఐపీఎస్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జాతీయ పతాకానికి గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా డీఐజీ ఎన్. శ్వేత పోలీసు అధికారులు, సిబ్బందికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల సేవలను స్మరించుకున్నారు. పోలీసు సిబ్బంది ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని సూచించారు. అనంతరం అధికారులు, సిబ్బందికి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మిఠాయిలను పంపిణీ చేశారు. కార్యాలయ ఆవరణలో స్వాతంత్ర్య వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగాయి. కార్యక్రమంలో అదనపు డీసీపీలు బాలస్వామి, సురేష్ కుమార్, హన్మకొండ, క్రైమ్, ట్రాఫిక్ ఏసీపీలు నర్సింగరావు, సదయ్య, సత్యనారాయణ, ఆర్ఐ సతీష్‌తో పాటు కార్యాలయ సూపరింటెండెంట్లు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వరంగల్ కమిషనరేట్ కార్యాలయంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**వరంగల్, 15 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**



వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పరిపాలన, ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ ప్రభాకర్ రావు కమిషనరేట్ పరిపాలన కార్యాలయ భవన ఆవరణలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించి జాతీయ పతాకానికి గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ ప్రభాకర్ రావు పోలీసు అధికారులు, సిబ్బందికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులను స్మరించుకుంటూ వారి ఆశయాలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని సూచించారు. అనంతరం అడిషనల్ డీసీపీ చేతుల మీదుగా అధికారులు, సిబ్బందికి మిఠాయిలు పంపిణీ చేశారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా కమిషనరేట్ కార్యాలయంలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# 80 ఏళ్ల స్వతంత్ర భారతంలోనూ కుల వివక్షా?

## ఒక జాతీయ పార్టీ అధ్యక్షుడికే అవమానం జరిగితే.. సామాన్య దళితుడి పరిస్థితి ఏమిటి?



**న్యూఢిల్లీ, 15 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు పూర్తవుతున్నా కుల వివక్ష పూర్తిగా సమసిపోలేదన్న ఆవేదన వ్యక్తమవుతోంది. రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమానత్వం, గౌరవం కల్పించడంతో పాటు అంటరానితనాన్ని నిషేధించినప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ కులం పేరుతో వివక్ష కొనసాగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీ ఘటన నేపథ్యంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే రాజ్యసభలో వ్యక్తం చేసిన ఆవేదన దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. "నన్ను అంటరానివాడిగా చూస్తున్నారా?" అంటూ ఆయన ప్రశ్నించడం కేవలం ఒక రాజకీయ నాయకుడి ఆవేదనగా కాకుండా, కుల వివక్షను ఎదుర్కొంటున్న అణగారిన వర్గాల ప్రజల సమస్యలకు ప్రతిబింబంగా మారింది. ఒక జాతీయ పార్టీ అధ్యక్షుడే తన సామాజిక నేపథ్యం కారణంగా అవమానాన్ని ఎదుర్కొన్నానని దేశ అత్యున్నత చట్టసభలో ప్రశ్నించాల్సిన పరిస్థితి ఉంటే.. సాధారణ దళితులు, అణగారిన వర్గాల ప్రజల పరిస్థితి ఎలా ఉంటుందన్న ప్రశ్న సహజంగానే తలెత్తుతోంది. రాష్ట్రాలు, జిల్లాలు, మండలాలు, గ్రామాల్లో కుల వివక్షకు గురవుతున్న సామాన్యుల సమస్యలను ఎవరు పట్టించుకుంటున్నారన్నది కూడా ఆలోచించాల్సిన అంశం. రాజ్యాంగంలోని ఆర్టికల్ 17 అంటరానితనాన్ని రద్దు చేసింది. ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించింది. అయినప్పటికీ పుట్టుక ఆధారంగా ఒక మనిషిని తక్కువగా చూడటం, అవమానించడం లేదా సామాజికంగా దూరం పెట్టడం వంటి ఘటనలు చోటుచేసుకుంటే.. రాజ్యాంగ విలువలను సమాజంలో మరింత బలంగా అమలు చేయాల్సిన అవసరం స్పష్టమవుతోంది. రాజకీయంగా ఎవరితోనైనా విభేదించవచ్చు. ప్రభుత్వ విధానాలను విమర్శించవచ్చు. నాయకుల నిర్ణయాలను వ్యతిరేకించవచ్చు. కానీ ఒక వ్యక్తి కులం, పుట్టుక లేదా సామాజిక నేపథ్యాన్ని అవమానించే హక్కు ఎవరికీ లేదని సామాజికవేత్తలు పేర్కొంటున్నారు. హల్ద్వానీ ఘటనకు సంబంధించిన వాస్తవాలు విచారణలో తేలాల్సి ఉంది. బాధ్యులు ఎవరైనా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో ఈ ఘటన లేవనెత్తిన సామాజిక ప్రశ్నపై దేశవ్యాప్తంగా చర్చ జరగాల్సిన అవసరం ఉంది. "ఒక దళిత జాతీయ నాయకుడికే ఇలాంటి పరిస్థితి ఎదురైతే.. సామాన్య దళితుడి పరిస్థితి ఏమిటి?" అన్న ప్రశ్నకు సమాజం సమాధానం చెప్పాల్సిన సమయం వచ్చింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జెండా ఎగురవేయడం, దేశభక్తిని చాటుకోవడం మాత్రమే నిజమైన స్వాతంత్ర్యం కాదు. కులం, మతం, ప్రాంతం, ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా ప్రతి మనిషిని గౌరవించే సమాజాన్ని నిర్మించడమే నిజమైన స్వాతంత్ర్యానికి అర్థం. రాజ్యాంగం అంటరానితనాన్ని రద్దు చేసింది.. ఇక మనుషుల మనసుల్లోని అంటరానితనం ఎప్పుడు రద్దవుతుంది? అనే ప్రశ్నకు సమాజం సమాధానం వెతకాల్సిన అవసరం ఉంది.

# సిగ్గు.. సిగ్గు.. సిగ్గు!

**స్వాతంత్ర్య దేశంలో ఆలయంలోనే మైనర్ బాలికపై లైంగిక దాడి ఆరోపణలు**
**ఒకవైపు 80వ స్వాతంత్ర్య వేడుకలు.. మరోవైపు బాలికలకు రక్షణ కరువు!**

**రామచంద్రాపురం, 15 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

దేశం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మునిగిపోయిన వేళ.. రామచంద్రాపురం ప్రాంతంలోని ఓ ఆలయంలో మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడనే ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఆలయంలో విధులు నిర్వహించే అర్చకుడు సాయన్నపై ఈ ఆరోపణలు రావడం స్థానికంగా ఆందోళనకు దారితీసింది. స్థానికుల సమాచారం ప్రకారం.. ఆలయానికి బయట నుంచి తాళం వేసి ఉన్న సమయంలో లోపల బాలికతో అర్చకుడు అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు గ్రామస్తులు గుర్తించినట్లు తెలుస్తోంది. వెంటనే అతడిని పట్టుకుని పోలీసులకు సమాచారం అందించినట్లు సమాచారం. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలుస్తోంది.

**ఇదేనా స్వాతంత్ర్యం?**

ఒకవైపు దేశం 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటోంది. గ్రామాలు, పట్టణాల్లో జాతీయ జెండాలు ఎగురుతున్నాయి.. దేశభక్తి ప్రసంగాలు కొనసాగుతున్నాయి. మరోవైపు మైనర్ బాలికకు ఆలయంలోనే భద్రత లేకపోవడం సమాజాన్ని కలచివేస్తోంది. దేవుడి సన్నిధిగా భావించే ఆలయంలోనే



బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడనే ఆరోపణలు రావడం తీవ్ర ఆందోళన కలిగించే విషయం. ఈ ఘటనపై పూర్తిస్థాయి, నిష్పక్షపాత దర్యాప్తు జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

**బాలికకు న్యాయం చేయాలి**

బాలికల భద్రత విషయంలో సమాజం మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. చిన్నారులపై లైంగిక వేధింపులు లేదా దాడులకు పాల్పడే వారిపై చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో బాధిత బాలికకు అవసరమైన రక్షణ,



న్యాయ సహాయం, మానసిక భరోసా కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. జాతీయ జెండా ఎగురవేయడం, స్వాతంత్ర్య వేడుకలు నిర్వహించడం మాత్రమే నిజమైన స్వాతంత్ర్యానికి కొలమానం కాదు. బాలికలకు భద్రత.. మహిళలకు గౌరవం.. నేరాలకు అడ్డుకట్ట.. బాధితులకు న్యాయం లభించినప్పుడే స్వాతంత్ర్యానికి నిజమైన అర్థం ఉంటుంది. ఈ ఘటనలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిపై సమగ్ర దర్యాప్తు జరిపి, ఆరోపణలు రుజువైతే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ప్రపంచ అవయవ దాన దినోత్సవం

**అవయవ దానం ఎందరికో కొత్త జీవితాన్ని ప్రసాదిస్తుంది**
**అవయవ దానం ప్రాముఖ్యతపై మెడికవర్ ఆసుపత్రిలో అవగాహన కార్యక్రమం**

**బెంగళూరు జై భీమ్ న్యూస్ :**

ప్రపంచ అవయవ దాన దినోత్సవంలో భాగంగా, అవయవ దానం ప్రాముఖ్యతపై బెంగళూరు నగరంలోని మహదేవపుర నియోజకవర్గ పరిధిలోని వైట్ ఫీల్డ్ మెడికవర్ ఆసుపత్రిలో ఒక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో, అవయవ దానం యొక్క ఆవశ్యకత, ఎవరు అవయవాలను దానం చేయగలరు, అవయవ దానం ద్వారా ఎన్ని ప్రాణాలను కాపాడవచ్చు మరియు సమాజంలో అవయవ దానంపై ఉన్న అపోహలను తొలగించడం వంటి అంశాలపై వైద్యులు మరియు నిపుణులు సమాచారం అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హరీష్ బాబు, డాక్టర్ మహాదేవ్ దేశాయ్ మరియు డాక్టర్ దిలీప్ మాట్లాడుతూ, అవయవ దానం అనేది ఒక వ్యక్తి మరణం తర్వాత కూడా చాలా మందికి కొత్త జీవితాన్ని ఇచ్చే ఒక ముఖ్యమైన మానవతా చర్య అని వివరించారు. ఒకే దాత యొక్క అవయవాల ద్వారా, గుండె, కాలేయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు వంటి వివిధ అవయవాలు అవసరమైన అనేక మంది రోగులకు చికిత్స చేసి వారి ప్రాణాలను కాపాడటం సాధ్యమవుతుందని వారు తెలిపారు. అవయవ దానం గురించి ప్రజలలో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ముందుగానే తమ అవయవాలను దానం చేయాలని నిర్ణయించుకున్న ఆరోగ్యవంతమైన వ్యక్తి, అవసరమైనప్పుడు మరొకరి ప్రాణాన్ని కాపాడగలరు. అవయవ దానం గురించిన నిర్ణయాన్ని కుటుంబ సభ్యులతో చర్చించడం కూడా చాలా ముఖ్యమని డాక్టర్ అన్నారు. ఈ సందర్భంగా మెడికవర్ ఆసుపత్రి ప్రాంతీయ డైరెక్టర్ సిద్ధారెడ్డి మాట్లాడుతూ, "అవయవ దానం కేవలం ఒక వైద్య ప్రక్రియ మాత్రమే కాదు, అది మానవత్వంలో అత్యున్నత రూపం. ఒక వ్యక్తి అవయవాలను దానం చేయాలనే నిర్ణయం, తమ ప్రియమైన వారిని తిరిగి పొందడం ద్వారా అనేక కుటుంబాలకు కొత్త ఆశను ఇస్తుంది. అవయవ దానంపై ఉన్న భయాలు, అపోహలను తొలగించి, అవగాహన కల్పించాలి. తద్వారా ఎక్కువ మంది అవయవ దానానికి ముందుకు వస్తారు," అని అన్నారు. ఈ కార్యక్రమంలో మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే, అవయవాలు దానం చేసిన దాతల కుటుంబ సభ్యులను, అవయవాలు స్వీకరించి కొత్త జీవితం పొందిన రోగులను మెడికవర్ ఆసుపత్రి సత్కరించింది. దీని ద్వారా, అవయవ దాతల విలువైన సేవను గౌరవించడంతో పాటు, అవయవ దానం ద్వారా ప్రాణాలు పొందిన వారి జీవితానుభవాలను పంచుకోవడానికి ఒక వేదిక ఏర్పడింది. ఈ సందర్భంగా, అవయవ దాతల కుటుంబ సభ్యులు మరియు అవయవాలు పొందిన రోగులు తమ హృదయపూర్వక మాటలను పంచుకున్నారు. తమ ప్రియమైనవారు అవయవదానం చేయాలనే నిర్ణయం తీసుకోవడం వల్ల మరో వ్యక్తికి జీవం లభించడం గర్వకారణమని దాతల కుటుంబాలు తెలిపాయి. అదే సమయంలో, అవయవాలు పొంది జీవితంలో కొత్త అవకాశం దక్కించుకున్న వారు అవయవ దాతల కుటుంబాలకు తమ కృతజ్ఞతలు తెలియజేస్తూ, అవయవ దానం యొక్క ప్రాముఖ్యత గురించి ప్రజలకు తెలియజేయడం తమ కర్తవ్యం అని అన్నారు. అవయవ దానంపై ప్రజల్లో ఎంత ఎక్కువ అవగాహన ఉంటే, అవయవాల కోసం ఎదురుచూస్తున్న రోగులకు సకాలంలో చికిత్స అందే అవకాశం అంత ఎక్కువగా ఉంటుంది. అందువల్ల, ప్రతి ఒక్కరూ అవయవ దానం గురించి సరైన సమాచారం తెలుసుకోవాలని, ఈ విషయాన్ని తమ కుటుంబాలతో చర్చించాలని, వీలైనంత ఎక్కువగా అవగాహన కల్పించాలని ఈ కార్యక్రమం పిలుపునిచ్చింది. "అవయవాలు దానం చేయండి -- మరణానంతరం కూడా జీవించి ఉండండి; మరొకరి జీవితానికి వెలుగుగా నిలవండి" అనే సందేశంతో ఈ కార్యక్రమం ముగిసింది.



# స్వర్ణోత్సవ శోభలో కాకతీయ విశ్వవిద్యాలయం





**ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు**

**కేయూ క్యాంపస్, 15 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉపకులపతి ఆచార్య కే. ప్రతాప్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జాతీయ నాయకుల చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం జాతీయ గీతం, తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. జాతీయ క్యాడెట్ల దళం గౌరవ వందనం సమర్పించింది. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ స్వర్ణోత్సవ సంవత్సరంలోకి అడుగుపెట్టిన కాకతీయ విశ్వవిద్యాలయానికి ఈ స్వాతంత్ర్య దినోత్సవం ప్రత్యేకమైనదన్నారు. విద్య, పరిశోధన, ఆవిష్కరణ, విద్యార్థి సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధిలో విశ్వవిద్యాలయం గణనీయ పురోగతి సాధించిందని తెలిపారు. రూ.35 కోట్లతో 42 పరిశోధనా ప్రాజెక్టులు, రూ.15 కోట్లతో కె--హబ్ అభివృద్ధి, కేంద్ర గ్రంథాలయానికి రూ.కోటి కేటాయింపు జరిగిందన్నారు. ఉద్యోగ నియామక కార్యక్రమాల ద్వారా సుమారు 800 అవకాశాలు లభించాయని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ వార్తా పత్రిక 'వివేచన'తో పాటు సామాజిక అధ్యయనాలు, మహిళా అధ్యయనాల పత్రికలను ఆవిష్కరించారు. జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన స్వచ్ఛంద సేవకులకు ప్రశంసాపత్రాలు, క్రీడా పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. మృతి చెందిన సాంకేతిక సిబ్బంది సయ్యద్ అక్రం కుమార్తె అఫ్షియా తబుస్సంకు కారుణ్య నియామక ఉత్తర్వులు అందించారు. రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, ప్రత్యేక విధుల అధికారి ఆచార్య బి. వెంకట్రామరెడ్డి, పాలక మండలి సభ్యులు, డీన్లు, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు. విద్యా నాణ్యత, పరిశోధన, ఆవిష్కరణ, ఉపాధి రంగాల్లో కాకతీయ విశ్వవిద్యాలయాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు సమష్టిగా కృషి చేయాలని ఉపకులపతి పిలుపునిచ్చారు.

# నాల్సార్ విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌పై బీసీఐ ఆదేశాలను ఉపసంహరించాలి

**హైదరాబాద్, 14 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**



నాల్సార్ న్యాయ విశ్వవిద్యాలయంలో 2026 బ్యాచ్‌లో న్యాయ విద్య పూర్తి చేసిన విద్యార్థులను న్యాయవాదులుగా నమోదు చేయరాదంటూ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా జారీ చేసిన ఆదేశాలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆలిండియా యూత్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి, రాష్ట్ర కార్యదర్శి కె. ధర్మేంద్ర ఒక ప్రకటనలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిర్ణయాన్ని తీవ్రంగా ఖండించారు. కొంతమంది విద్యార్థులు భారత ప్రధాన న్యాయమూర్తి పట్ల తమ అభిప్రాయాలను, అసమ్మతిని వ్యక్తం చేసినందుకు మొత్తం 2026 బ్యాచ్ విద్యార్థుల న్యాయవాదుల నమోదును అడ్డుకోవడం అప్రజాస్వామికమని వారు పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేయడం, ప్రశ్నించడం నేరం కాదని అన్నారు. రాజ్యాంగ సంస్థల నిర్ణయాలపై విమర్శలు చేయడం, ప్రశ్నలు లేవనెత్తడం ప్రజాస్వామ్య హక్కుల్లో భాగమని తెలిపారు. విద్యార్థులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసినందుకు వారి విద్యా, వృత్తిపరమైన భవిష్యత్తును ప్రభావితం చేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. కొంతమంది విద్యార్థుల అభిప్రాయాలను కారణంగా చూపి మొత్తం బ్యాచ్‌పై ప్రభావం చూపే విధంగా నిర్ణయం తీసుకోవడం సామూహిక శిక్ష విధించినట్లుగా ఉందని విమర్శించారు. నాల్సార్‌లో సంవత్సరాలపాటు కష్టపడి న్యాయ విద్య పూర్తి చేసిన విద్యార్థుల న్యాయవాదుల నమోదును అడ్డుకోవడం వల్ల వారి ఉపాధి అవకాశాలు, వృత్తి భవిష్యత్తుతో పాటు వారి కుటుంబాలపై కూడా తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చట్టబద్ధమైన సంస్థగా తన అధికారాలను బాధ్యతాయుతంగా, నిష్పాక్షికంగా వినియోగించాలని కోరారు. వ్యక్తిగత అభిప్రాయాలు, విమర్శలు, అసమ్మతిని ఆధారంగా చేసుకుని విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసే చర్యలకు పాల్పడటం ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదకరమైన ఉదాహరణగా మారుతుందని హెచ్చరించారు. విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్ని, విమర్శనాత్మక ఆలోచనను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ముఖ్యంగా న్యాయ విద్యార్థులు భవిష్యత్తులో రాజ్యాంగం, చట్టం, న్యాయవ్యవస్థను పరిరక్షించాల్సిన న్యాయవాదులుగా ఎదగాల్సి ఉన్నందున వారిలో స్వేచ్ఛగా ఆలోచించే సామర్థ్యాన్ని కాపాడటం అత్యంత ముఖ్యమన్నారు. నాల్సార్ 2026 బ్యాచ్ విద్యార్థుల న్యాయవాదుల నమోదుపై విధించిన ఆంక్షలను తక్షణమే ఉపసంహరించుకోవాలని, రాష్ట్ర బార్ కౌన్సిళ్లకు పంపిన ఆదేశాలను వెనక్కి తీసుకోవాలని తెలంగాణ ఆలిండియా యూత్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. విద్యార్థులపై ఎలాంటి ప్రతీకార చర్యలు తీసుకోకుండా వారి విద్యా, వృత్తిపరమైన హక్కులను రక్షించాలని కోరింది. నాల్సార్ విద్యార్థుల హక్కుల పరిరక్షణకు ఆలిండియా యూత్ ఫెడరేషన్ తెలంగాణ అండగా నిలుస్తుందని, ప్రజాస్వామ్య హక్కుల కోసం నిరంతరం పోరాడుతుందని రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి, రాష్ట్ర కార్యదర్శి కె. ధర్మేంద్ర స్పష్టం చేశారు.

# ఎల్బీనగర్‌లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు





**వరంగల్, 15 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ నగరంలోని ఎల్బీనగర్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 13వ డివిజన్ కార్పొరేటర్ బస్వరాజు కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం ఆలిండియా యూత్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రి మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను నాయకులు ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధులు కలలుగన్న సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామాజిక--ఆర్థిక హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశ భవిష్యత్తు నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని, రాజ్యాంగ విలువలను కాపాడుతూ ప్రజల హక్కుల కోసం ముందుకు రావాలని అన్నారు. దేశ అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు సమానంగా అందినప్పుడే నిజమైన స్వాతంత్ర్య స్ఫూర్తి నెరవేరుతుందని పేర్కొన్నారు. పేదలు, కార్మికులు, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు, మహిళల సమస్యల పరిష్కారానికి ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో 13వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆర్. అరుణ్, అనిల్, ఎండీ షకీర్, ఎండీ ఘని, రాజు, రమేష్ తదితరులు పాల్గొని స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక ప్రజలు, యువత, మహిళలు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. దేశ ఐక్యత, సమగ్రత, ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కట్టుబడి పనిచేయాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎంపీ కడియం కావ్య



**హనుమకొండ, 15 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య వేడుకల్లో పాల్గొన్నారు. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసు బలగాల గౌరవ వందనం, పరేడ్‌ను ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు తిలకించారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన స్వాతంత్ర్య సమరయోధులను ఘనంగా సత్కరించారు. జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన వివిధ ప్రభుత్వ శాఖల ప్రదర్శనశాలలను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఎంపీ కడియం కావ్య సందర్శించారు. ఆయా శాఖల ద్వారా అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవల వివరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు, పోలీసు అధికారులు, స్వాతంత్ర్య సమరయోధులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఖిలా వరంగల్‌లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు





**వరంగల్, 15 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

ఖిలా వరంగల్ ఖుషీ మహల్ ప్రాంగణంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద, డీసీపీ అంకిత్‌కుమార్, అటవీ శాఖ అధికారి నిఖిత, ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు. తొలుత మంత్రి పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ గీతం, తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. పోలీసు పరేడ్‌ను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, సాధించిన ప్రగతిపై జిల్లా ప్రగతి నివేదికను మంత్రి ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. స్వాతంత్ర్య సమరయోధులను మంత్రి కొండా సురేఖ, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. సమరయోధులు డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం కోరగా, మంత్రి వెంటనే హామీ ఇవ్వడంతో ప్రాంగణం కరతాళధ్వనులతో మార్మోగింది. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, ఉద్యోగులకు మంత్రి చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేశారు. వివిధ శాఖలు ఏర్పాటు చేసిన ప్రదర్శనశాలలను మంత్రి, జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు జి. సంధ్యారాణి, వై.వి. గణేష్ తదితరులతో కలిసి సందర్శించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, పోలీసులు, స్వాతంత్ర్య సమరయోధులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాకతీయ విశ్వవిద్యాలయ శాస్త్ర విభాగాల డీన్‌గా ఆచార్య బి. వెంకట్రామరెడ్డి





**బోధన, పరిశోధన, పరిపాలనలో విశేష అనుభవం.. కీలక బాధ్యతలు చేపట్టిన ఆచార్య వెంకట్రామరెడ్డి**

**కేయూ క్యాంపస్, 15 ఆగస్ట్ 2026 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయ శాస్త్ర విభాగాల డీన్‌గా ఆచార్య బి. వెంకట్రామరెడ్డిని రెండేళ్ల కాలానికి నియమించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె. ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత డీన్ ఆచార్య జి. హనుమంత్ నుంచి ఆచార్య బి. వెంకట్రామరెడ్డి బాధ్యతలు స్వీకరించనున్నారు. విశ్వవిద్యాలయ విద్యా, పరిశోధన, పరిపాలనా రంగాల్లో సుదీర్ఘ అనుభవం కలిగిన ఆచార్య బి. వెంకట్రామరెడ్డి కొత్త బాధ్యతలు చేపట్టడం ప్రాధాన్యత సంతరించుకుంది. మూడు దశాబ్దాలకు పైగా బోధన, పరిశోధన, విద్యా పరిపాలన రంగాల్లో సేవలందించిన ఆయన కాకతీయ విశ్వవిద్యాలయంలో అనేక కీలక పదవులను నిర్వహించి తనదైన ముద్ర వేశారు.

### మూడు దశాబ్దాలకు పైగా బోధనా అనుభవం

ఆచార్య బి. వెంకట్రామరెడ్డి 1986లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ప్రథమ శ్రేణిలో బీఎస్సీ పూర్తి చేశారు. 1988లో కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి ప్రథమ శ్రేణిలో ఎంఎస్సీ, 1990లో కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి బీఎడ్, 1992లో కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ, 2000లో హైదరాబాద్ విశ్వవిద్యాలయం నుంచి ప్రథమ శ్రేణిలో పీజీడీసీఎస్ పూర్తి చేశారు. 1989లో సీకేఎం ప్రభుత్వ కళాశాలలో భౌతికశాస్త్ర అధ్యాపకుడిగా తన బోధనా ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన అనంతరం కాకతీయ విశ్వవిద్యాలయ పరిధిలోని పీజీ కళాశాలలో సేవలందించారు. 2003లో కాకతీయ విశ్వవిద్యాలయంలో భౌతికశాస్త్ర సహాయ ఆచార్యుడిగా చేరి, 2015లో సహ ఆచార్యుడిగా, 2018లో ఆచార్యుడిగా పదోన్నతి పొందారు. మొత్తం 37 సంవత్సరాల బోధనా అనుభవం ఆయన సొంతం కాగా, ఇందులో స్నాతకోత్తర స్థాయిలో సుమారు 30 సంవత్సరాలు, స్నాతక స్థాయిలో ఏడు సంవత్సరాల అనుభవం ఉంది.

### పరిశోధనలోనూ విశేష కృషి

బోధనతో పాటు పరిశోధనా రంగంలోనూ ఆచార్య వెంకట్రామరెడ్డి విశేష కృషి చేశారు. అణు, పరమాణు స్పెక్ట్రోస్కోపీ, పదార్థ విజ్ఞానశాస్త్రం ఆయన ప్రధాన పరిశోధనా రంగాలుగా ఉన్నాయి. ఆయన పరిశోధనలకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఆయన పరిశోధనా ప్రస్థానానికి సంబంధించిన గణాంకాల ప్రకారం 37 సంవత్సరాల పరిశోధనా అనుభవం, 30 ఐ10 సూచీ, 18 హెచ్ సూచీ, వెయ్యికి పైగా పరిశోధనా ఉల్లేఖనలు ఉన్నాయి. అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో మొత్తం 67 పరిశోధనా పత్రాలను ప్రచురించగా, వాటిలో 54 పరిశోధనా పత్రాలు అంతర్జాతీయ శాస్త్రీయ ప్రచురణల పరిధిలో ఉన్నాయి. పరిశోధనా పత్రాల సగటు ప్రభావ సూచీ 3.2గా ఉంది. ఆయన మార్గదర్శకత్వంలో ఆరుగురు పరిశోధకులు పీహెచ్‌డీ పట్టాలు పొందగా, మరో ముగ్గురు పరిశోధకులు ప్రస్తుతం పరిశోధన కొనసాగిస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో 55కు పైగా సదస్సులు, కార్యశాలలు, శాస్త్రీయ సమావేశాల్లో పాల్గొన్న ఆయన శాస్త్ర పరిశోధన రంగంలో తన సేవలను విస్తరించారు.

### కోట్లాది రూపాయల పరిశోధనా ప్రాజెక్టులు

ఆచార్య వెంకట్రామరెడ్డి పలు ప్రతిష్ఠాత్మక పరిశోధనా ప్రాజెక్టులకు ప్రధాన పరిశోధకుడిగా వ్యవహరించారు. జీవ అణువుల కంపన స్పెక్ట్రోస్కోపీ, సాంద్రత కార్యాత్మక సిద్ధాంత ఆధారిత గణనలకు సంబంధించిన పరిశోధనా ప్రాజెక్టుకు రూ.11.45 లక్షల నిధులు మంజూరయ్యాయి. అలాగే జీవ అణువుల పరమాణు నిర్మాణం, లక్షణాలపై సాంద్రత కార్యాత్మక సిద్ధాంత ఆధారిత గణనలకు రూ.46.64 లక్షల పరిశోధనా నిధులు లభించాయి. కాకతీయ విశ్వవిద్యాలయంలో అణువులు, పదార్థ భౌతికశాస్త్ర పరిశోధనా కేంద్రానికి డైరెక్టర్, ప్రధాన పరిశోధకుడిగా వ్యవహరిస్తూ రూ.4.23 కోట్ల విలువైన పరిశోధనా కార్యక్రమానికి నాయకత్వం వహిస్తున్నారు.

### అంతర్జాతీయ గుర్తింపు.. శాస్త్రీయ సమాజంలో ప్రత్యేక స్థానం

అంతర్జాతీయ స్థాయిలో సుమారు 46 ప్రతిష్ఠాత్మక పరిశోధనా పత్రికలకు సమీక్షకుడిగా ఆచార్య వెంకట్రామరెడ్డి సేవలందించారు. అమెరికన్ కెమికల్ సొసైటీ, ఎల్సేవియర్, రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ, టేలర్ అండ్ ఫ్రాన్సిస్, వైలీ, స్ప్రింగర్ తదితర అంతర్జాతీయ ప్రచురణ సంస్థలకు చెందిన పత్రికల్లో సమీక్షకుడిగా వ్యవహరించారు. అంతర్జాతీయ స్థాయిలో అమెరికాలోని ఓహియో స్టేట్ విశ్వవిద్యాలయం, సదరన్ మెథడిస్ట్ విశ్వవిద్యాలయాలను సందర్శించి పరిశోధనా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయన అంతర్జాతీయ పరిశోధనా అనుభవం కాకతీయ విశ్వవిద్యాలయ శాస్త్ర పరిశోధనలకు మరింత ఉపయోగపడే అవకాశముంది.

### అవార్డులు.. ప్రతిష్ఠాత్మక పురస్కారాలు

ఆచార్య బి. వెంకట్రామరెడ్డి విద్యా, పరిశోధనా రంగాల్లో చేసిన సేవలకు అనేక పురస్కారాలు, గౌరవాలు అందుకున్నారు. 2024లో తెలంగాణ ప్రభుత్వం ఉన్నత విద్యాశాఖ ద్వారా అందించిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి పొందారు. 2022 సంవత్సరానికి తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ విశిష్ట సహచరుడిగా ఎంపికయ్యారు. భారత స్పెక్ట్రో ఫిజిక్స్ సంఘం నుంచి 2022లో జీవితకాల సాధన పురస్కారాన్ని అందుకున్నారు. అదే సంస్థ నుంచి 2020లో ప్రత్యేక పరిశోధనా పురస్కారాన్ని పొందారు. 2018లో ఎల్సేవియర్ ప్రచురణ సంస్థ నుంచి అత్యుత్తమ సమీక్షకుడిగా గుర్తింపు పొందారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో 2024లో భౌతికశాస్త్రంలో మొదటి స్థానంలో, సహజ శాస్త్రాల్లో మూడో స్థానంలో నిలిచినట్లు శాస్త్రవేత్తల ర్యాంకింగ్ సంస్థ గుర్తించింది. తెలంగాణ శాస్త్ర కాంగ్రెస్ నిర్వహణలోనూ కీలక పాత్ర పోషించిన ఆయన 2025లో జరిగిన రెండో తెలంగాణ శాస్త్ర కాంగ్రెస్‌కు నిర్వహణ కార్యదర్శిగా వ్యవహరించారు.

### పరిపాలనా రంగంలో అనేక కీలక బాధ్యతలు

ఆచార్య వెంకట్రామరెడ్డి కాకతీయ విశ్వవిద్యాలయంలో కేవలం బోధనా, పరిశోధనా రంగాలకే పరిమితం కాకుండా పరిపాలనా రంగంలోనూ అనేక కీలక బాధ్యతలు నిర్వహించారు. కాకతీయ విశ్వవిద్యాలయం గోదావరిఖని పీజీ కేంద్రం ప్రిన్సిపాల్‌గా, విశ్వవిద్యాలయ వసతి గృహాల డైరెక్టర్‌గా, భౌతికశాస్త్ర విభాగాధిపతిగా సేవలందించారు. పాఠ్యప్రణాళికల బోర్డు చైర్‌పర్సన్‌గా, పరీక్షల అదనపు నియంత్రణాధికారిగా, పరీక్షల నియంత్రణాధికారిగా, డీన్‌గా, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వహించారు. విద్యార్థుల సంక్షేమం, నియామకాలు, విశ్వవిద్యాలయ వసతులు, విద్యా వ్యవహారాలు, పరీక్షల నిర్వహణ వంటి విభిన్న రంగాల్లో ఆయనకు పరిపాలనా అనుభవం ఉంది. తెలంగాణ రాష్ట్ర విద్యా ఉమ్మడి ప్రవేశ పరీక్షకు కన్వీనర్‌గా కూడా ఆయన కీలక బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం కాకతీయ విశ్వవిద్యాలయంలో ప్రత్యేక విధుల అధికారి హోదాలో సేవలందిస్తున్నారు.

### ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడిగా కూడా బాధ్యతలు

కాకతీయ విశ్వవిద్యాలయ ఉపాధ్యాయుల సంఘానికి 2025-2027 కాలానికి అధ్యక్షుడిగా ఆచార్య వెంకట్రామరెడ్డి ఎన్నికయ్యారు. విశ్వవిద్యాలయ అధ్యాపకుల సమస్యలు, విద్యా ప్రమాణాల మెరుగుదల, పరిశోధనాభివృద్ధి, విద్యార్థుల ప్రయోజనాల పరిరక్షణ వంటి అంశాల్లో ఆయన చురుకైన పాత్ర పోషిస్తున్నారు.

### శాస్త్ర విభాగాల అభివృద్ధిపై ఆశలు

ఇప్పటికే బోధన, పరిశోధన, పరిపాలన రంగాల్లో విశేష అనుభవాన్ని సొంతం చేసుకున్న ఆచార్య బి. వెంకట్రామరెడ్డి తాజాగా కాకతీయ విశ్వవిద్యాలయ శాస్త్ర విభాగాల డీన్‌గా బాధ్యతలు చేపట్టనుండటంతో శాస్త్ర విభాగాల్లో విద్యా ప్రమాణాలు, పరిశోధనా కార్యకలాపాలు మరింత బలోపేతం అవుతాయనే ఆశాభావం వ్యక్తమవుతోంది. అంతర్జాతీయ స్థాయిలో పరిశోధనా సంబంధాలు పెంపొందించడం, విద్యార్థులు--పరిశోధకులకు మెరుగైన అవకాశాలు కల్పించడం, పరిశోధనా ప్రాజెక్టులను మరింతగా ఆకర్షించడం, శాస్త్ర విభాగాల్లో మౌలిక వసతులను బలోపేతం చేయడం వంటి అంశాల్లో ఆయన అనుభవం విశ్వవిద్యాలయానికి ప్రయోజనకరంగా మారనుంది.

### అభినందనల వెల్లువ

ఆచార్య బి. వెంకట్రామరెడ్డికి శాస్త్ర విభాగాల డీన్‌గా కొత్త బాధ్యతలు అప్పగించడంపై కాకతీయ విశ్వవిద్యాలయ అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఆయన సుదీర్ఘ విద్యా, పరిశోధనా, పరిపాలనా అనుభవం విశ్వవిద్యాలయ శాస్త్ర విభాగాల అభివృద్ధికి మరింత దోహదపడుతుందని వారు అభిప్రాయపడ్డారు. బోధనలో అనుభవం.. పరిశోధనలో ప్రతిభ.. పరిపాలనలో పట్టు.. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు.. ఇలా విభిన్న రంగాల్లో విశిష్ట అనుభవాన్ని సొంతం చేసుకున్న ఆచార్య బి. వెంకట్రామరెడ్డి శాస్త్ర విభాగాల డీన్‌గా కొత్త బాధ్యతలు చేపట్టడం కాకతీయ విశ్వవిద్యాలయ శాస్త్ర రంగానికి మరో కీలక ముందడుగుగా భావిస్తున్నారు.

## తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో.. ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**వరంగల్,15 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

గ్రేటర్ వరంగల్‌లోని తెలంగాణ రక్షణ సేన పార్టీ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రేటర్ వరంగల్ అధ్యక్షులు నడిపెల్లి వెంకటేశ్వరరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ, భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. పరస్పర గౌరవం, దేశభక్తి, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి విలువలను పెంపొందించుకోవాలని అన్నారు. అసమానతలు లేని శాంతియుత, బలమైన ప్రజాస్వామ్య భారతదేశ నిర్మాణమే స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ప్రతి పౌరుడికి సమన్యాయం, సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం అందేలా నవ భారత నిర్మాణంలో ప్రతి ఒక్కరూ కర్తవ్యనిష్ఠతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జి వీరభక్షపతి, జిల్లా సీనియర్ నాయకులు బండారి సుమన్ పటేల్, నిశాంత్ రావు, న్యాయవాది రాధాకృష్ణ, జ్యోతి రెడ్డి, విద్యార్థి విభాగం నాయకులు పోగుల సుతేజ్, దీకొండ గణేష్ శర్మ, ఎల్.ఎస్. నాయక్, బంటి, సామాజిక విభాగం నాయకులు వివేక్ తదితరులు పాల్గొన్నారు.



# కల్తీ ఆహార తయారీ కేంద్రంపై టాస్క్‌ఫోర్స్ దాడి












**రూ.4.07 లక్షల విలువైన ఆహార పదార్థాలు, ముడిసరుకు స్వాధీనం.. ఇద్దరు అరెస్ట్**

**హైదరాబాద్, 15 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

గడువు ముగిసిన ముడిసరుకులు, సరైన లేబులింగ్ లేని సువాసన ద్రవ్యాలతో నాసిరకం ఆహార పదార్థాలను తయారు చేస్తున్న కేంద్రంపై సైబరాబాద్ కమిషనర్ టాస్క్‌ఫోర్స్ శంషాబాద్ జోన్ పోలీసులు దాడి చేశారు. రంగారెడ్డి జిల్లా ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని బొంగుళూర్ గ్రామంలో ఉన్న ఎంఎస్ కేఎస్ఎం ఫుడ్ ప్రొడక్ట్స్ తయారీ కేంద్రంలో ఈ దాడి నిర్వహించారు. ఈ ఘటనలో సంస్థ యజమాని మహ్మద్ ఖాలీద్(38), మేనేజర్ సంతోష్‌కుమార్(44)లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి సుమారు రూ.4,07,300 విలువైన ఆహార పదార్థాలు, ముడిసరుకులను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల తనిఖీల్లో సుమారు 1,560 జార్ల సోన్‌పాపిడి, 240 జార్ల పల్లీపట్టి, లేబుల్ లేని వివిధ రకాల సువాసన ద్రవ్యాలు, కోకో పౌడర్, 670 కిలోల లేబుల్ లేని బెల్లం, గడువు ముగిసిన ఫ్లేవర్లు, డ్రైఫ్రూట్స్, కొబ్బరి పొడి తదితర పదార్థాలు గుర్తించారు. అలాగే 50 కిలోల చొప్పున ఉన్న 72 మైదా బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. వ్యాపారంలో ఆశించిన స్థాయిలో లాభాలు రాకపోవడంతో సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో యజమాని, మేనేజర్‌తో కలిసి గడువు ముగిసిన ముడిసరుకులు, సరైన లేబులింగ్ లేని సువాసన ద్రవ్యాలను ఉపయోగించి ఆహార పదార్థాలను తయారు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. తయారీ కేంద్రంలో అపరిశుభ్రమైన వాతావరణం ఉన్నట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న శంషాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, హెచ్-ఫాస్ట్ బృందం, జీహెచ్ఎంసీ ఆహార భద్రతాధికారితో కలిసి దాడి నిర్వహించారు. అనంతరం నిందితులను, స్వాధీనం చేసుకున్న పదార్థాలను ఆదిబట్ల పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై ఆదిబట్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**గడువు తేదీ పరిశీలించండి**

ప్యాక్ చేసిన ఆహార పదార్థాలను కొనుగోలు చేసే సమయంలో తయారీ తేదీ, గడువు తేదీ, బ్యాచ్ నంబర్, పదార్థాల వివరాలు, లేబులింగ్‌ను తప్పనిసరిగా పరిశీలించాలని పోలీసులు ప్రజలకు సూచించారు. గడువు ముగిసిన లేదా నాణ్యతపై అనుమానం ఉన్న ఆహార పదార్థాలను కొనుగోలు చేయవద్దని హెచ్చరించారు. కల్తీ, నాసిరకం ఆహార పదార్థాల తయారీ లేదా విక్రయాలపై అనుమానం ఉంటే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ఈ దాడిని శంషాబాద్ జోన్ ఇన్‌స్పెక్టర్ డి. కృష్ణమోహన్ నేతృత్వంలో ఎస్ఐలు కె. మన్సూర్ అలీ, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, హెచ్-ఫాస్ట్ బృందం, జీహెచ్ఎంసీ ఆహార భద్రతాధికారి రాకేష్ సంయుక్తంగా నిర్వహించారు.

# మోత్కూర్ గ్రామంలో ఘనంగా 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు





**వికారాబాద్ జిల్లా జై భీమ్ న్యూస్ :**

వికారాబాద్ జిల్లా దోమ మండలం మోత్కూరు గ్రామంలో 80 వ స్వతంత్ర దినోత్సవం సందర్భంగా ఎస్సీ కాలనీలో అంబేద్కర్ విగ్రహం దగ్గర గుణిగారి అంజలయ్య జాతీయ జెండాను ఎగురవేశారు. కాలనీ లోని యువకులు, పెద్దలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి, విద్యార్థినీలు, ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులు, వార్డు సభ్యులు, నాయకులు, తదితరులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అలాగే పోస్ట్ ఆఫీస్ గ్రామ పంచాయతీ ఆవరణలో కూడా జాతీయ జెండా ఎగురవేశారు. ప్రాథమిక పాఠశాల లో ప్రధానోపాధ్యాయులు పాండు ఆధ్వర్యంలో ఘనంగా స్వతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. చిన్న పిల్లలు తనదైన శైలిలో నృత్యాలతో ఆకట్టుకున్నారు, ఉపన్యాసాలు, సంగీతాలోతో ఆకర్షినియులయ్యారు. పాఠశాల ముందు స్టేజ్ లేక చాలా ఇబ్బంది పడుతున్నాము, ఏ ప్రోగ్రామ్ అయినా ఇబ్బంది పడుతున్నాం, గ్రామస్థులు, పిల్లల తల్లిదండ్రులు, అందరూ కలిసి స్టేజ్ కి డబ్బులు వేసుకొని పూర్తి చేద్దాం అని ప్రధానోపాధ్యాయులు పాండు అభిప్రాయపడ్డారు, అలాగే అని సంపల్లీ మల్లేశం వార్డు సభ్యులు తన వంతు రూ . 1000 వెయ్యి, గుణిగారి అంజలయ్య రూ. 1000 వెయ్యి, రాపోల్ నరసింహ రూ. 1000వెయ్యి ఎర్కిచర్ల సాయన్న రూ . 1000 వెయ్యి, దోమ యాదయ్య మేస్త్రి స్టేజ్ ను ఎన్ని రోజులైన నా పని మానుకొని కట్టించే బాధ్యత నాది అని అన్నారు, ఇంకొంత మంది సిమెంట్, రాయి, బండలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. నా పాఠశాల నా పిల్లల కోసం నా వంతు రూ. 10,000 వేలు ఇస్తానని, పిల్లల తల్లిదండ్రులు ముందుండి చెప్యాలని ఆయన కోరారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో కూడా ఘనంగా స్వతంత్ర దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఆ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు మల్లేశ్వర్, గ్రామ ప్రథమ పౌరుడు గ్రామ సర్పంచ్ కొత్తపేట ఆనంద్ కుమార్, తదితరులు పాల్గొని పిల్లల భవిష్యత్తు కోసం తగిన సూచనలు ఇస్తూ.. స్వతంత్ర సమర యోధులు గురించి మాట్లాడుతూ స్మరించుకున్నారు. పోయిన 10వ తరగతి పాఠశాల మొదటి స్థాయి, రెండవ స్థాయి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు యుపద్యాయుల సంఘం అధ్యక్షులు కొత్తపేట రామకృష్ణ ధనేశ్వర్ తండ్రి రిటైడ్ ఉపాధ్యాయులు, కీ, శే, కొత్తపేట రామస్వామి పుట్టిన రోజు ఆగస్ట్ 15 న కావడం సందర్భంగా వారికి నగదు బహుమతులు కూడా ఉంచారు. పాఠశాలకు మంచి ఉత్తీర్ణత సాధించి, స్కూల్ కి మంచి పేరు తీసుకొస్తే ముందుముందు తెలంగాణ మోడల్ స్కూల్ గా మారే అవకాశం ఉందని ఆయన అన్నారు. విద్యార్థుల ఉపన్యాసాలతో, రికార్డు డాన్స్ లతో స్వతంత్ర దినోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




# వరంగల్ వారియర్స్ క్రికెటర్ వైష్ణవ్‌కు విష్ణువర్ధన్ రెడ్డి నివాళి

**హన్మకొండ, 15 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**



వరంగల్ వారియర్స్ క్రికెటర్ వైష్ణవ్ అకాల మరణం పట్ల వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అల్లుడు, యువ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. వైష్ణవ్ స్వగృహానికి వెళ్లిన విష్ణువర్ధన్‌రెడ్డి ఆయన పార్థివదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిన్న వయసులోనే వైష్ణవ్ మృతి చెందడం తీవ్రంగా కలచివేసిందని అన్నారు. క్రికెట్‌పై ఆసక్తితో ఎదుగుతున్న యువ క్రీడాకారుడి అకాల మరణం కుటుంబ సభ్యులతో పాటు వరంగల్ క్రీడాభిమానులకు తీరని లోటని పేర్కొన్నారు. వైష్ణవ్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన విష్ణువర్ధన్‌రెడ్డి, ఈ విషాద సమయంలో కుటుంబానికి మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.

# జి.వి.ఎస్.ఆర్ కాలనీలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**హన్మకొండ, 15 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**




గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ రెండవ డివిజన్ పరిధిలోని గుండ్లసింగారం జి.వి.ఎస్.ఆర్ కాలనీలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను కాలనీ సభ్యులు, ప్రజాప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు కుక్కల రాజు మాట్లాడుతూ, ఎందరో స్వాతంత్ర్య సమరయోధులు తమ ప్రాణాలను త్యాగం చేసి, వీరోచిత పోరాటాల ద్వారా దేశానికి స్వాతంత్ర్యం సాధించారని తెలిపారు. వారి త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాతావరణంలో జీవిస్తున్నామని అన్నారు. విభిన్న మతాలు, భాషలు, సంస్కృతులకు భారతదేశం వేదికగా నిలుస్తూ ప్రపంచ దేశాల్లో ప్రత్యేక గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రవి నాయక్, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు పుట్ట తిరుపతి, మాజీ హనుమకొండ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మాదాసి అజయ్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజయ్య, సీసీ రోడ్డు కాంట్రాక్టర్ నాగేశ్వరరావు, కాలనీ అధ్యక్షుడు కుక్కల రాజు, కోశాధికారి యాకయ్య, కమిటీ సభ్యులు కొమురయ్య, పరమాత్మ, కుక్కమూడి వంశీ, మోహన్, రమేష్, మల్లయ్యతో పాటు కాలనీ మహిళలు, సభ్యులు పాల్గొన్నారు.

# హనుమకొండ డీఎంహెచ్‌వో తీరుపై ఆరోపణలు

**విచారణకు డిమాండ్**

**నోటిఫికేషన్ లేకుండానే ఔట్‌సోర్సింగ్ నియామకాలా?**

**ప్రైవేట్ ఆసుపత్రులకు అనుమతుల విషయంలోనూ ఆరోపణలు**

**హనుమకొండ, 15 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**



జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో జరుగుతున్న వ్యవహారాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి అప్పయ్య తీరుపై పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో సమగ్ర విచారణ జరిపించాలని జిల్లా ప్రజలు, నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ప్రత్యేకంగా ఎలాంటి బహిరంగ నోటిఫికేషన్ లేకుండానే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల భర్తీ చేపట్టారనే ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీశాయి. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు అవకాశం కల్పించాల్సిన నియామక ప్రక్రియలో పారదర్శకత పాటించారా? అర్హతలు, రిజర్వేషన్లు, ఎంపిక విధానం వంటి అంశాలను బహిర్గతం చేశారా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. హనుమకొండ జిల్లా అధికారిక ఉపాధి కార్యాలయం ప్రకారం నిరుద్యోగుల నమోదు, అర్హత ఆధారంగా అభ్యర్థుల ఎంపికకు సంబంధించిన విధానాలు అమల్లో ఉన్నాయి. ఉద్యోగ అవకాశాల కోసం జాబ్‌మేళాలు, అభ్యర్థుల స్పాన్సరింగ్ వంటి ప్రక్రియలు కూడా కొనసాగుతున్నాయి. మరోవైపు ప్రైవేట్ ఆసుపత్రులకు అనుమతుల విషయంలోనూ డబ్బులు తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఇవి ఆరోపణలు మాత్రమేనని, వాటిపై అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉందని గమనించాలి. ప్రజల ఆరోగ్యంతో నేరుగా ముడిపడి ఉన్న వైద్య రంగంలో ఆసుపత్రుల అనుమతులు, నమోదు, నిబంధనల అమలులో పూర్తి పారదర్శకత అత్యంత కీలకం. ఇటీవల తెలంగాణలోని ఇతర జిల్లాల్లోనూ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేట్ ఆసుపత్రులపై వైద్య ఆరోగ్య శాఖ చర్యలు చేపట్టిన సందర్భాలు ఉన్నాయి. హైదరాబాద్, మేడ్చల్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఆసుపత్రులకు నోటీసులు జారీ చేసినట్లు తాజా నివేదికలు పేర్కొంటున్నాయి.

**విచారణతోనే వాస్తవాలు వెలుగులోకి**

డీఎంహెచ్‌వోపై వస్తున్న ఆరోపణలన్నింటినీ ప్రభుత్వం ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని జిల్లా వాసులు కోరుతున్నారు. ఔట్‌సోర్సింగ్ నియామకాలకు సంబంధించిన ప్రకటనలు, అభ్యర్థుల ఎంపిక, అర్హతలు, నియామక ఉత్తర్వులు, ప్రైవేట్ ఆసుపత్రులకు ఇచ్చిన అనుమతుల వివరాలను పరిశీలిస్తే ఆరోపణల్లో వాస్తవం ఎంతవరకు ఉందో స్పష్టమవుతుందని వారు అంటున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన వైద్య ఆరోగ్య శాఖలో ప్రతి నిర్ణయం పారదర్శకంగా, నిబంధనల ప్రకారం ఉండాలి. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.. ఆరోపణలు నిరాధారమైతే అధికారులపై వస్తున్న అనుమానాలకు అధికారిక వివరణ ఇవ్వాలి అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం ఈ వ్యవహారం హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో చర్చనీయాంశంగా మారింది. దీనిపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాల్సి ఉంది.

# 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సందేశం

**వరంగల్, 15 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

భారత స్వాతంత్ర్య దినోత్సవ శుభ సందర్భంగా ఇక్కడికి విచ్చేసిన నగర ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, స్వాతంత్ర్య సమరయోధులకు, అధికారులకు, పాత్రికేయ మిత్రులకు, ఉద్యోగులకు మరియు విద్యార్థులకు నా హృదయపూర్వక 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. తెలంగాణ రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖల మంత్రిగా నేడు ఈ పవిత్ర వేడుకల్లో పాల్గొనడం నాకు ఎంతో ఆనందంగా ఉంది. దేశ స్వాతంత్ర్యం కోసం ఎన్నో కష్టనష్టాలను ఓర్చి, తమ ప్రాణాలను సైతం త్యాగం చేసి దేశభక్తికి ప్రతీకగా నిలిచిన మహనీయులందరికీ ఈ సందర్భంగా శిరస్సు వంచి ఘన నివాళులు అర్పిస్తున్నాను. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, యువత బలిదానాలు, విద్యార్థుల అలుపెరగని పోరాటాల ఫలితంగా మనం తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నాం. రాష్ట్ర ప్రజల ఆశయాలు, ఆత్మగౌరవం, అమరుల త్యాగాల స్ఫూర్తితో తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోంది. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక – 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను రూపొందించి కార్యాచరణ ద్వారా సంక్షేమం, అభివృద్ధి, పారదర్శక పాలనకు కొత్త ఊపునిస్తూ తెలంగాణను దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా ముందుకు సాగుతున్నాం. ముఖ్యమంత్రి దూరదృష్టి నాయకత్వ పటిమతో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో ప్రగతి పథంలో దూసుకుపోతుందని చెప్పవచ్చును.

## రైతు సంక్షేమం

రైతు సంక్షేమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. రైతులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ వెన్నుదన్నుగా నిలుస్తూ, వారి ఆర్థికాభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు చేపడుతోంది. మారుతున్న పర్యావరణ పరిస్థితులు, వాతావరణ మార్పుల ప్రభావాలను దృష్టిలో ఉంచుకుని రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఇందులో భాగంగా పంట మార్పిడి విధానాన్ని ప్రోత్సహిస్తున్నాం. పంట మార్పిడి విధానం ద్వారా సాగు ఖర్చులను తగ్గించడంతో పాటు నేల సారాన్ని కాపాడుకోవచ్చు. పంటల వైవిధ్యంతో రైతులకు మెరుగైన దిగుబడులు, స్థిరమైన ఆదాయం లభించేలా చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలో వరిపంట 1,39,997 ఎకరాలలో ప్రతి సంవత్సరం పండిస్తున్నాం. ఈ సంవత్సరం ఎల్‌నినో ప్రభావం వలన అతి తక్కువ వర్షపాతం నమోదు అవడం వల్ల 51,045 ఎకరాలలోనే వరి నాట్లు పడ్డాయి. మిగతా 90 వేల ఎకరాలలో ఇప్పటి వరకు 44,745 ఎకరాలలో వరి బదులు ఆరుతడి పంటలను అనగా 24,370 ఎకరాలలో మొక్కజొన్న, 12,450 ఎకరాలలో పెసర మరియు ఇతర ఆరుతడి పంటలను సాగు చేస్తున్నారు. రైతు సోదరులు పై విషయాలను గమనించి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని ఈ సందర్భంగా కోరుతున్నాను. రైతు భీమా పథకం కింద మరణించిన రైతు కుటుంబానికి 5 లక్షల రూపాయలు ఆర్థిక సహాయం అందించడం జరుగుతుంది. ఇందులో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరానికి 242 మంది రైతులకు మరణానంతరం వారి కుటుంబానికి రూ. 12.10 కోట్ల రూపాయల ఆర్థిక సహాయం అందించడం జరిగింది. కేంద్రప్రభుత్వం చేపట్టిన ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని రైతులందరిని నమోదు చేయాలనేది లక్ష్యం. ఇందులో ఇప్పటివరకు జిల్లాలో 1,65,330 మంది రైతులకు గాను సుమారుగా 1,33,120 మంది రైతులను నమోదు చేయడం జరిగింది. జిల్లాలో 20,925 ఎకరాలలో వివిధ ఉద్యానవన పంటలు సాగు చేయడం జరుగుతోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో సమీకృత ఉద్యాన అభివృద్ధి మిషన్ ద్వారా 247.35 లక్షల ఆర్థిక లక్ష్యానికి గాను ఇప్పటివరకు 1193 ఎకరాల్లో 585 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి వీరికి రూ. 1 కోటి 21 లక్షలు ఆర్థిక సహాయం కొరకు ప్రతిపాదనలు పంపాము. ఎల్‌నినో ప్రభావం వలన ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వం చేసిన సూచన మేరకు కూరగాయలు, పండ్ల తోటలు, బిందు సేద్యం, తుంపర్ల సేద్యం వంటి వాటికి ప్రాధాన్యత ఇచ్చేందుకు రైతులకు అవగాహన కల్పించడం తో పాటు ఈ ఆర్థిక సంవత్సరంలో 1100 ఎకరాలలో రూ. 173.80 లక్షల వ్యయంతో పామాయిల్ తోటలు పెంచుటకు లక్ష్యాన్ని నిర్దేశించుకోగా ఇప్పటి వరకు రూ. 76.23 లక్షల వ్యయంతో 211 మంది రైతులు 566 ఎకరాలలో పామాయిల్ మొక్కలు నాటడం జరిగింది. మత్స్యశాఖ ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో 12 వేల 388 టన్నుల చేపలు, 360 టన్నుల రొయ్యలు ఉత్పత్తి చేయడం జరిగింది. 100% సబ్సిడీతో ఒక రిజర్వాయర్, 705 మీడియం మరియు మైనర్ ఇరిగేషన్ చెరువులలో రూ. 195.89 లక్షల విలువ గల చేప పిల్లలను పంపిణీ చేయడం లక్ష్యంగా చేసుకోవడం జరిగింది. జిల్లాలో రెండు ప్రాంతీయ పశు వైద్యశాలలు, 24 ప్రాథమిక పశు వైద్యశాలలు, 31 గ్రామీణ పశు వైద్య కేంద్రాల ద్వారా లక్షా 25 వేల పశువులు, ఐదు లక్షల 76 వేల మేకలు, గొర్రెలు, 36 లక్షల కోళ్లకు వైద్య సహాయం అందించడంతో ఆయా కుటుంబాల అభివృద్ధికి సహాయం అందిస్తున్నాము.

## అభయహస్తం – 6 గ్యారంటీల పథకాలు

ప్రజల సంక్షేమం, మహిళా సాధికారత, రైతుల అభ్యున్నతి, యువతకు ఉపాధి కల్పన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అభయహస్తం 6 గ్యారంటీలను అమలు చేస్తోంది. ఈ పథకాల ద్వారా రాష్ట్రంలోని లక్షలాది కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయి.

## రైతు భరోసా

రైతు భరోసా కింద భూమి ఉన్న ప్రతి రైతుకు ఎకరానికి రూ. 6000 చొప్పున సంవత్సరానికి రెండు సార్లు రైతులకు ఆర్థిక సహాయం అందించడం జరుగుతోంది. ఇందులో భాగంగా ఇప్పటివరకు 1,58,201 మంది రైతులకు 2,70,050 ఎకరాలకు గాను రూ. 162.03 కోట్ల రూపాయలు 2023 నుండి సంవత్సరానికి 2 సార్లు అందించడం జరుగుతోంది.

## మహాలక్ష్మి పథకం

మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం ద్వారా ఇప్పటివరకు జిల్లాలో 7 కోట్ల 50 లక్షల మంది మహిళలకు రూ. 311.88 కోట్ల ఆర్థిక లబ్ధి చేకూరింది.

## గృహజ్యోతి పథకం

ఈ పథకం కింద జిల్లాలో 1,40,862 కుటుంబాలకు మార్చి 2024 నుంచి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించగా, ఇందుకు గాను ప్రభుత్వం రూ. 128.82 కోట్లను సబ్సిడీ రూపంలో ప్రజలకు అందిస్తోంది.

## ఇందిరమ్మ ఇండ్లు

పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోంది. అర్హులైన ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద జిల్లాలో 9522 సొంత ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేయగా, 6,977 మంది లబ్ధిదారులు నిర్మాణ పనులు ప్రారంభించారు. ప్రస్తుతం 3457 ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉండగా, 2973 ఇళ్ల నిర్మాణం పూర్తై గృహ ప్రవేశాలు కూడా జరిగాయి. ఇప్పటివరకు రూ. 202.42 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. రెండు పడకల ఇళ్ల పథకం ద్వారా జిల్లాలో 3,845 ఇండ్లకు టెండర్ ప్రక్రియ పూర్తి అయింది. ఇప్పటి వరకు 2237 ఇండ్లను రూ. 148.63 కోట్ల వ్యయంతో పూర్తి చేయడం జరిగింది. ఇంకా 1608 ఇండ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉన్నాయి.

## సాగునీటి రంగం

ఎల్‌నినో ప్రభావం, వాతావరణ పరిస్థితుల వలన ఆరుతడి పంటలు మరియు పంట మార్పిడి విధానాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. జిల్లాలో 7 చెక్ డ్యాములు నిర్మించేందుకు గాను రూ. 63.482 కోట్లు మంజూరు చేయడం జరిగింది. జిల్లాలోని 13 మండలాల్లో మొత్తం 2,93,763 ఎకరాలకు సాగునీరు అందించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం జరిగింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ఫేజ్-1 కింద 63,492 ఎకరాలు, ఫేజ్-2 కింద 22,123 ఎకరాలు సాగునీటి పరిధిలోకి తీసుకురావడం జరిగింది. అలాగే జె. చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా 1,15,580 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించడం కోసం ప్రతిపాదించడం జరిగింది.

## గ్రామీణాభివృద్ధి

వీబీ-జీ రామ్ జీ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలో 17.44 లక్షల పనిదినాలు కల్పించి, 70 వేల 527 మంది కూలీలకు రూ. 39 కోట్ల 88 లక్షలను వేతనంగా చెల్లించాము. జిల్లాలో 9 వేల 669 మహిళా సభ్యులచే రూ. 40 కోట్ల 67 లక్షల రూపాయల పెట్టుబడితో చిన్న చిన్న వ్యాపారాలు ఏర్పాటు చేయించడం జరిగింది. ఈ ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు లింకేజీ కింద 2114 స్వశక్తి మహిళా సంఘాలకు రూ. 148.80 కోట్ల రుణాలు మంజూరు చేశాం. స్త్రీ నిధి కింద రూ. 8 కోట్ల 30 లక్షల రుణం మంజూరు చేశాం. అదేవిధంగా 1,31,958 మంది మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ చేయడం జరిగినది. 59 గ్రామ సంఘ భవనాల నిర్మాణానికి రూ. 5.90 కోట్లు మంజూరు చేయడం జరిగింది. జల శక్తి అభియాన్ జలసంచయ జన భగీదారి 1.0 కింద 72,262 నీటి సంరక్షణ పనులు విజయవంతంగా పూర్తి చేసినందుకు వరంగల్ జిల్లాకు జాతీయ అవార్డు కింద రూ. 1 కోటి నగదు అందుకుంది. జల శక్తి అభియాన్ జలసంచయ జన భగీదారి 2.0 కింద 8,342 పనులు పూర్తి చేయడం జరిగింది. జిల్లా పంచాయతీ శాఖ ద్వారా ఈ ఆర్థిక సంవత్సరానికి విడుదలైన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 14.37 కోట్లను సంబంధిత గ్రామపంచాయతీలకు జమ చేయడం జరిగింది. ఈ నిధులను గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక ప్రకారం అభివృద్ధి పనులకు వినియోగిస్తున్నారు.

## ఇందిరా మహిళా శక్తి

కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయ్యాలనే లక్ష్యంగా ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లను ప్రారంభించి, వివిధ బ్యాంకుల ద్వారా, స్త్రీ నిధి రుణాలు ఇప్పించి మహిళలకు జీవనోపాధి కలిగించడం జరుగుతోంది. రూ. 3 కోట్ల 68 లక్షల 95 వేల రూపాయలను 3,211 మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలుగా అందజేయడం జరిగినది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 1,557 సంఘాలకు రూ. 60 కోట్ల 70 లక్షల 87 వేల రూపాయలను వివిధ బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించడంతో పాటు 37,006 మంది వీధి విక్రయదారులకు వివిధ బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించడం జరిగింది. జిల్లాలోని 34,964 మంది విద్యార్థులకు రెండు జతల యూనిఫాం కుట్టు చార్జీల కోసం రూ. 31,58,377లను మహిళా సంఘాలకు చెల్లించాము. అలాగే ప్రస్తుత విద్యా సంవత్సరానికి కూడా పిల్లల యూనిఫారములు మన మహిళా సంఘాలే తయారు చేశారని తెలియచేయడానికి సంతోషిస్తున్నాను.

## మహిళా, శిశు, దివ్యాంగుల సంక్షేమం

మహిళా, శిశు, దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత కల్పించింది. జిల్లాలోని 919 అంగన్వాడీ కేంద్రాలను చిన్న పిల్లల పూర్వ ప్రాథమిక విద్యాకేంద్రాలు గా ఉన్నతీకరణ చేయడం జరిగింది. ఆరోగ్యలక్ష్మీ పథకం కింద జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల ద్వారా 4వేల 475 మంది గర్భిణీలు, 3594 బాలింతలు, 6 సంవత్సరాల లోపు వయస్సు గల 39 వేల 981 మంది పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నాం. ప్రతి నెల నాలుగో శనివారం దివ్యాంగులు, వయోవృద్ధుల కొరకు ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి సమస్యలు పరిష్కరించడం జరుగుతున్నది. మిషన్ శక్తి పథకం ద్వారా గృహ హింస, స్కూల్ డ్రాప్ అవుట్, విద్యార్థులకు బుతుక్రమ పరిశుభ్రత, బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాల గురించి 1000కి పైగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. అదే విధంగా పని ప్రదేశాలలో లైంగిక వేధింపుల నిషేధ చట్టంపై అవగాహన కల్పిస్తూ, ఆయా కార్యాలయాలలో అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది.

## ఆహార భద్రత కార్డులు

పేదలకు నాణ్యమైన ఆహార భద్రత కల్పించడంలో భాగంగా, జిల్లాలోని 509 చౌక ధరల దుకాణాల ద్వారా 2,96,929 కార్డుదారులకు నెలకు 6 కిలోల చొప్పున సన్నబియ్యం ఉచితంగా పంపిణీ చేయబడుతోంది. ధాన్యం సేకరణలో భాగంగా 2025-26 రబీ సీజన్‌లో రూ. 399.67 కోట్ల విలువైన ధాన్యాన్ని 37331 మంది రైతుల నుండి నేరుగా సేకరించడం జరిగింది. 1,36,037 మంది లబ్ధిదారులకు రూ. 500కే గ్యాస్ సిలిండర్లు సబ్సిడీపై అందించి, మొత్తం రూ. 2,118.74 లక్షల సబ్సిడీ మొత్తాన్ని నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరిగింది. అర్హులైన పేద కుటుంబాలకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా వరంగల్ జిల్లాలో 29,772 కొత్త రేషన్ కార్డులు జారీ చేయగా, వాటి ద్వారా 93,825 మంది లబ్ధి పొందుతున్నారు. ఈ రోజు మధ్యాహ్నం రాష్ట్ర వ్యాప్తంగా స్మార్ట్ రేషన్ కార్డ్స్ పంపిణీ కూడా చేస్తున్నామని చెప్పడానికి ఎంతో ఆనందిస్తున్నాను.

## వైద్య, ఆరోగ్యం

జిల్లాలో 14 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 7 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, మహాత్మా గాంధీ ఆసుపత్రి, సీకేఎం, ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రి, వర్ధన్నపేట ఏరియా ఆసుపత్రి, నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రి, 118 ఆరోగ్య ఉప కేంద్రాలు, 2 బస్తీ దవాఖానాలు, 82 పల్లె దవాఖానాల ద్వారా ప్రతిరోజు సుమారు నాలుగు లక్షల మందికి వైద్య సేవలు అందిస్తున్నాం. జిల్లాలో వైద్య సేవలను మెరుగుపరచడానికి భారీగా నిధులు వెచ్చిస్తున్నాము. వరంగల్ హెల్త్ సిటీలో రూ. 1371 కోట్లతో నిర్మిస్తున్న 2,100 పడకల సామర్థ్యం గల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం ఇప్పటి వరకు 90% పూర్తయ్యాయి, పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఆరోగ్య బీమా పరిమితిని రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచడంతో పాటు 163 కొత్త వ్యాధులను ఈ పథకం పరిధిలోకి తీసుకువచ్చాము. జిల్లాలో ఆరోగ్యశ్రీ కింద రూ. 56.06 కోట్ల వ్యయంతో 10,565 మందికి వైద్య చికిత్స అందించడం జరిగింది.

## విద్య

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపట్టిన మిడ్ డే మీల్స్ మరియు సి.యం. బ్రేక్‌ఫాస్ట్ పథకం వలన విద్యార్థిని విద్యార్థులకు పౌష్టిక





ఆహారం అందించడం ద్వారా డ్రాప్ అవుట్లు తగ్గగా, విద్యార్థుల హాజరు శాతం పెరిగిందని చెప్పుటకు సంతోషిస్తున్నాను. అలాగే జిల్లాలో వినూత్నంగా నిర్వహిస్తున్న స్ఫూర్తి కార్యక్రమం పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే కాక భవిష్యత్ ప్రణాళికను స్వతహాగా నిర్ణయం తీసుకోగలిగే శక్తి సామర్థ్యాలను పెంపొందిస్తోంది. గత విద్యా సంవత్సరంలో పదవ తరగతి రిజల్ట్ దీనికి నిదర్శనం. వరంగల్ జిల్లాలో 295 పాఠశాలల్లో 18969 మంది విద్యార్థులకు ఉదయం అల్పాహార భోజనం అందజేయబడుతోంది. జిల్లాలోని 458 ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా రూ. 10.45 కోట్లతో మౌలిక వసతులు కల్పించాం. పేద విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలలో విద్య అందించేందుకు జిల్లాలో మూడు యంగ్ ఇండియా సమీకృత గురుకులాలను ఏర్పాటు చేస్తున్నాం. ప్రభుత్వ ఇంటర్మీడియట్ జూనియర్ కళాశాలల అభివృద్ధి మరియు ఆధునీకరణ కొరకు రూ. 1 కోటి 36 లక్షలు మంజూరు చేయడం జరిగింది. విద్యార్థుల మానసిక అభివృద్ధి కోసం టెలిమానస్ టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయడం జరిగింది. కళాశాలల్లో తరగతి గదులు, ప్రయోగశాలల పర్యవేక్షణ కొరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనైనది. 6 జూనియర్ కళాశాలల్లో 1594 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మరియు ఉదయం అల్పాహారం అందిస్తున్నాము.

## సంక్షేమం

షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి: 2026-27 విద్యా సంవత్సరంలో 968 మంది ఎస్సీ విద్యార్థుల సంక్షేమం కోసం రూ. 83 లక్షలకు పైగా ఖర్చు చేశాము. ఉన్నత విద్యకు ప్రోత్సాహకంగా పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ కింద 3042 మంది విద్యార్థులకు రూ. 87 లక్షల 64 వేల రూపాయలు మంజూరు చేశాము. విదేశీ విద్యను అభ్యసించే విద్యార్థులకు మరియు కులాంతర వివాహక ప్రోత్సాహక పథకం ద్వారా 2026-27 సంవత్సరంలో 52 మంది లబ్ధిదారులకు రూ.కోటి 30 లక్షలు ఆర్థిక సహాయం అందజేశాము. వెనుకబడిన తరగతుల అభివృద్ధి: జిల్లాలో పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం కింద 2,183 మంది బీసీ విద్యార్థులకు రూ. 7 కోట్ల 11 లక్షల 7 వేల రూపాయలు మంజూరు చేశాము. 264 మంది విద్యార్థులకు ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్ ద్వారా రూ. 10 లక్షల 56 వేల రూపాయలు మంజూరు చేయడం జరిగింది. 2026-27 విద్యా సంవత్సరంలో 1110 మంది విద్యార్థులకు భోజన సదుపాయాలు మరియు వసతి గృహ నిర్వహణ కోసం రూ.కోటి 67 లక్షలు కేటాయించాము. మైనారిటీ సంక్షేమం: ఈ ఆర్థిక సంవత్సరంలో పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్స్ కింద 818 మైనారిటీ విద్యార్థులకు రూ. 94.18 లక్షలు చెల్లించడం జరిగినది. ఇందిరా మహిళా శక్తి కుట్టుమిషన్ పథకం ద్వారా వరంగల్ తూర్పు, నర్సంపేట నియోజకవర్గం వారికి 498 కుట్టు మిషన్లను పంపిణీ చేయడం జరిగింది. రంజాన్ పండుగ సందర్భంగా మూడు నియోజకవర్గాలలో రూ. 12 లక్షలను ఇఫ్తార్ విందుకై మంజూరు చేయడమైనది. అలాగే నిరుపేద మైనారిటీ కుటుంబాలకు నూతన వస్త్రాలు పంపిణీ చేయడం జరిగింది.

## పరిశ్రమల అభివృద్ధి

పరిశ్రమల శాఖ ద్వారా జిల్లా అభివృద్ధిలో టీజీ-ఐపాస్ అనుమతులు, పెట్టుబడి రాయితీ, ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం, డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ తెలంగాణ, ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం, ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం, పారిశ్రామికంగా అభివృద్ధి జిల్లా కమిటీ ఏర్పాటు ద్వారా జిల్లాను ఎగుమతుల హబ్‌గా తీర్చిదిద్దుటకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది.

## కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్

కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు కొరకు గీసుగొండ మండలం శాయంపేట, సంగెం మండలం చింతలపల్లి గ్రామాలలో 1357 ఎకరాల భూమిని సేకరించడం జరిగింది. ఇందులో భాగంగా 866 మంది రైతులకు రూ. 145 కోట్ల పరిహారం చెల్లించడం జరిగింది. ఇందులో భూమి కోల్పోయిన నిర్వాసితులందరికీ ప్లాట్స్ మరియు ఇందిరమ్మ ఇండ్లను కూడా మంజూరు ఇవ్వడం జరిగింది. ఇటీవల ప్రధానమంత్రి ద్వారా మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను పీఎం మిత్ర పార్క్‌గా ప్రారంభించడం జరిగిందని చెప్పడానికి సంతోషిస్తున్నాను. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ద్వారా ఈ ప్రాంత ప్రజలకు ఎన్నో ఉద్యోగావకాశాలు కల్పించబడుతుందని తెలియజేస్తున్నాను.

## మౌలిక సదుపాయాల అభివృద్ధి – ఇన్నర్ రింగ్ రోడ్

వరంగల్ ఇన్నర్ రింగ్ రోడ్డుకు ఖఖఆనా మరియు ప్రభుత్వ నిధుల కింద రూ. 319 కోట్ల మొత్తానికి పరిపాలనా అనుమతి లభించింది. ఆర్టీఓ కార్యాలయం నుండి ఎనుమాముల మార్కెట్ వరకు 8.30 కి.మీ. పొడవుతో ప్రతిపాదించిన వరంగల్, హనుమకొండ మరియు కాజీపేట త్రీ-నగరాల చుట్టూ 200 అడుగుల వెడల్పుతో వృత్తాకార బైపాస్ రోడ్డుగా ఉండబోతుంది.

## వరంగల్లో ఆధునిక బస్ స్టేషన్ నిర్మాణం

టీజీఆర్టీసీకి చెందిన వరంగల్ బస్ స్టేషన్ మరియు దానిని ఆనుకుని ఉన్న జీడబ్ల్యూఎంసీ స్థలంలో కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ రూ. 125 కోట్ల అంచనా వ్యయంతో ఆధునిక బస్ స్టేషన్ నిర్మించడానికి ప్రభుత్వం పరిపాలనా అనుమతి మంజూరు చేయడం జరిగింది. బస్ స్టేషన్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.

## వరంగల్ ఎయిర్‌పోర్ట్

వరంగల్ ఎయిర్‌పోర్ట్ రన్‌వే విస్తరణ కొరకు ఖిలా వరంగల్ మండలంలోని గాడిపల్లి, నక్కలపల్లి గ్రామాలలో 253 ఎకరాల భూమిని సేకరించి ఎయిర్‌పోర్ట్ అథారిటీ వారికి అప్పగించడం జరిగింది. ఇందులో భాగంగా 330 మంది రైతులకు రూ. 258 కోట్ల పరిహారం చెల్లించడం జరిగింది. త్వరలోనే పనులు ప్రారంభించబడతాయని ఆశిస్తున్నాను.

## నేషనల్ హైవే చీఎ-163-

నేషనల్ హైవే చీఎ-163- వరంగల్ డివిజన్‌లోని 3 మండలాలు, 11 గ్రామాల మీదుగా 25.10 కి.మీ. పొడవు మరియు నర్సంపేట డివిజన్‌లోని నెక్కొండ మండలంలో 7 గ్రామాల మీదుగా 13.10 కి.మీ. పొడవున నిర్మాణం ప్రతిపాదించగా అందుకు గాను 176.19 హెక్టార్ల భూసేకరణ చేయగా, 1360 మంది భూనిర్వాసితులకు రూ. 56.54 కోట్ల రూపాయలు పరిహారంగా చెల్లించడమైనది.

## సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయం

సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయం మరియు అధికారుల నివాస గృహాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 80 కోట్ల అంచనా విలువతో చేపట్టిన పనులు పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి.

## రహదారుల అభివృద్ధి

వరంగల్ పట్టణ రహదారి అభివృద్ధిలో భాగంగా పోతన కళామందిర్ రోడ్డు, కాశీబుగ్గ నుండి ముత్యాలపల్లి రోడ్డు, వరంగల్ నుండి గాదెపల్లి, చింతల్ నుండి ఖమ్మం రోడ్డు, కడిపికొండ నుంచి వరంగల్ రోడ్డు రహదారుల మెరుగుదల పనులకు రూ. 49.5 కోట్ల వ్యయంతో అనుమతులు లభించగా పనులు పురోగతిలో ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాలలో రహదారుల అభివృద్ధికై ఇల్లంద, పర్వతగిరి, జల్లి లింగగిరి రహదారి విస్తరణకై రూ. 16 కోట్ల అంచనా వ్యయంతో అనుమతులు లభించగా పనులు పురోగతిలో ఉన్నాయి. హెచ్ఏఎం పథకం కింద 12 పనులకు గాను రూ. 349.57 కోట్లు మంజూరు చేయగా ఏజెన్సీలకు అంగీకార పత్రాలు జారీచేయడం జరిగింది.

## రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు

కాజీపేట-విజయవాడ సెక్షన్‌లో రైల్వే కి.మీ. 388/20-22 వద్ద ఎల్‌సీ నం. 66 మరియు కి.మీ. 391/4-6 వద్ద ఉన్న ఎల్‌సీ నం. 67 స్థానంలో, ఊకల్-తొర్రూర్ రోడ్‌లోని కి.మీ. 4/0 వద్ద నాలుగు లైన్ల రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కొరకు రూ. 94.10 కోట్ల అంచనా విలువతో ప్రతిపాదనలు ఆమోదం పొందగా పనులు పురోగతిలో ఉన్నాయి. జిల్లాలో ఎస్టీఎస్‌డీఎఫ్, ఆర్‌డీఎఫ్, సీఆర్‌ఎఫ్, ఆర్‌సీపీఎల్‌డబ్ల్యూఈ పథకాల ద్వారా 38 పనులకు గాను రూ. 370 కోట్ల 98 లక్షల నిధులు మంజూరు చేయడం జరిగినది. పనులు వివిధ దశలలో పురోగతిలో ఉన్నవి.

## వరంగల్ మహానగర పాలక సంస్థ

అమృత 2.0 – అవుట్‌కమ్ బేస్డ్ రిఫార్మ్ ఇన్సెంటివ్ – రూ. 10.00 కోట్లు ప్రాపర్టీ ట్యాక్స్ మ్యాపింగ్‌ను డ్రోన్ ఆధారిత సర్వే మరియు ఇతర ఆధునిక సాంకేతికతల ద్వారా చేపట్టడానికి, అలాగే సమగ్ర నగర వ్యాప్త జీఐఎస్ మరియు 3డీ డిజిటల్ అర్బన్ డేటాబేస్ రూపొందించడానికి రూ. 10 కోట్లకు ప్రభుత్వం పరిపాలన అనుమతి లభించింది. 2040 వరకు జనాభా పెరుగుదలకు అనుగుణంగా వరంగల్ నగర అవసరాలకు సరిపోయేలా మాస్టర్ ప్లాన్‌ను తీసుకువచ్చాం. అలాగే అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ కూడా త్వరలో పనులు ప్రారంభించడానికి ప్రణాళికలు వివిధ దశలలో ఉన్నాయి.

## సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్

పరిశుభ్రమైన వరంగల్ నగర నిర్మాణంలో భాగంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది. ఇందులో భాగంగా రూ. 4 కోట్లతో చేపట్టిన బయో మైనింగ్ పనులు పూర్తయ్యాయి. అదే విధంగా మహానగర పాలక సంస్థ పరిధిలో లెగసీ వ్యర్థాలను బయో మైనింగ్ ద్వారా శాస్త్రీయ పద్ధతిలో ప్రాసెస్ చేసేందుకు రూ. 6.60 కోట్లతో రెండు పనులు చేపట్టగా ప్రస్తుతం అవి పురోగతిలో ఉన్నాయి. అలాగే సేంద్రియ వ్యర్థాలను సమర్థవంతంగా వినియోగించుకునే లక్ష్యంతో రూ. 2 కోట్ల వ్యయంతో బయో మెథనైజేషన్ పనులు కొనసాగుతున్నాయి.

## మోడల్ సౌర విద్యుత్ గ్రామం

జిల్లాలోని రాయపర్తి మండలంలోని పోతిరెడ్డిపల్లి, కిష్టాపూర్ గ్రామాలను ఎంపిక చేసి 144 మంది గృహజ్యోతి వినియోగదారుల గృహాలపై రూ. 125 కోట్ల వ్యయంతో 2 కిలోవాట్ల సామర్థ్యం గల ఆన్-గ్రిడ్ సోలార్ రూఫ్‌టాప్ వ్యవస్థలను ఏర్పాటు చేసే పనులు జరుగుతున్నాయి. ఈ రెండు గ్రామాల్లోని 341 వ్యవసాయ పంపుసెట్లను రూ. 16.87 కోట్ల వ్యయంతో సౌరశక్తి ఆధారిత పంపుసెట్లుగా మార్చనుంది. ఈ ప్రాజెక్టు అమలుతో గ్రామాల్లో స్వచ్ఛమైన, పునరుత్పాదక ఇంధన వినియోగం పెరగడంతో పాటు విద్యుత్ వ్యయాలు తగ్గి, పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు అందుతుంది.

## అటవీ పరిరక్షణ

పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపునకు వరంగల్ జిల్లా యంత్రాంగం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది. 2026 వన మహోత్సవంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని శాఖలకు నిర్దేశించిన 25 లక్షల 51 వేల 248 మొక్కల నాటే లక్ష్యంలో ఇప్పటి వరకు 11 లక్షల 50 వేల 897 మొక్కలను నాటడం జరిగింది.

## పాకాల ఈకో టూరిజం

పాకాల అర్బన్ ఫారెస్ట్ పార్క్‌ను పర్యాటకులు, సందర్శకులకు మరింత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు సీతాకోకచిలుకల వనం, పిల్లల ఆటస్థలం, పగోడాలు, బ్యాటరీ వాహనాలు, బోటింగ్ సౌకర్యాలు, పాత్‌వేలు, సీసీ రోడ్లు, క్యాంటీన్ వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. పాకాల సరస్సులో ఇప్పటికే బోటింగ్ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. పచ్చదనం, పర్యావరణ పరిరక్షణతో పాటు పాకాల ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు కొనసాగుతున్నాయి.

## శాంతి భద్రతలు

శాంతి భద్రతల నిర్వహణ సమర్థవంతంగా జరిగితేనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం శాంతి భద్రతలకు అత్యంత ప్రాధాన్యం కల్పించింది. ఆధునిక సాంకేతికతతో నేరాలు కూడా పలు కొత్త రూపాలు సంతరించుకుంటున్నాయి. యువత డ్రగ్స్, గంజాయి వంటి వాటికి అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకోకుండా, డ్రగ్స్ నివారించేందుకు ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తున్నది. డ్రగ్స్ అంశాన్ని ఎటువంటి పరిస్థితులలోనూ ఉపేక్షించడం జరుగదని, డ్రగ్స్‌పై చేస్తున్న పోరాటానికి స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు పూర్తి స్థాయిలో మద్దతు అందిస్తూ డ్రగ్స్ భూతాన్ని జిల్లా నుండి శాశ్వతంగా తరిమివేయాలని కోరుతున్నాను.

# నాదర్గుల్‌లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**నాదర్గుల్(జై భీమ్ న్యూస్)**

బెన్‌సప్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ బెన్నీ ఆహ్వానం మేరకు నాదర్గుల్‌లో నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఎర్రోళ్ల ప్రవీణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించి, స్వాతంత్ర్య దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. ఎర్రోళ్ల ప్రవీణ్ మాట్లాడుతూ.. "ఈరోజు మనం ఇంత స్వేచ్ఛగా, సంతోషంగా జీవిస్తున్నామంటే అందుకు ప్రధాన కారణం మన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, ప్రాణత్యాగాలే. వారి త్యాగాలను మనం ఎప్పటికీ మరువకూడదు" అని అన్నారు. దేశ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను నిజాయితీగా నిర్వర్తించాలని ఆయన సూచించారు. "మనమంతా కొత్తగా ఏదైనా చేయాల్సిన అవసరం లేదు. ఎవరి బాధ్యతలను వారు సక్రమంగా, క్రమశిక్షణతో నిర్వర్తిస్తే అదే దేశానికి చేసే గొప్ప సేవ" అని ఎర్రోళ్ల ప్రవీణ్ పేర్కొన్నారు. అనంతరం నాదర్గుల్‌లోని కాలనీ వాసులకు, బెన్‌సప్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ సంస్థ ఉద్యోగులకు, కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఆయన 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు, ఉద్యోగులు, కాలనీ వాసులు, స్థానికులు తదితరులు పాల్గొని స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.



## బందమాదారం గ్రామంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**జై భీమ్ న్యూస్ (మేడ్చల్)**

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా బందమాదారం గ్రామంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎర్రోళ్ల ప్రవీణ్ పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించి, విద్యార్థులు మరియు గ్రామస్తులకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎర్రోళ్ల ప్రవీణ్‌తో పాటు నీరుడు మహేష్, రాకేష్ చరణ్, సుదర్శన్, నర్సింగ్, ఆనంద్, బన్నీ, తోట సాయి లడ్డు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవసరమైన సామగ్రిని అందించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదిగి దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కార్యక్రమంలో పాల్గొన్న వారు ఆకాంక్షించారు.

## సాగర్ ఆయకట్టుకు గోదావరి జలాలు

**రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా విడుదల**
**ఎమ్మెల్యే పాయంతో కలసి విడుదల చేసిన మంత్రి తుమ్మల**

**భద్రాద్రి కొత్తగూడెం,ఆగస్ట్15(జై భీమ్ న్యూస్) :**

ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సరిగ్గా లేక పంటల సాగుకు ఇబ్బందులు ఏర్పడ్డాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా గోదావరి జలాలు.. సాగర్ ఆయకట్టుకు భరోసాగా మారిందన్నారు. మారేళ్లపాడు ఎత్తిపోతల పథకాన్ని నెలాఖరులోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నీళ్ల దగ్గర రాజకీయాలు చేస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. రాజీవ్ లింక్ కెనాల్‌కు గోదావరి జలాలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విడుదల చేశారు. శనివారం అశ్వాపురం మండలం సీతారామ పంప్ హౌస్ వద్ద మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.. మోటార్ స్విచ్ ఆన్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రైతులు ఎవరూ కూడా దిగులు పడొద్దని.. మీ భూముల్లో పైప్‌లైన్ వేసిన మరలా పూడ్చి ఇస్తామని మంత్రి చెప్పారు. యధావిధిగా మళ్లీ వ్యవసాయం చేసుకోవచ్చని అన్నారు. పినపాకకి నీళ్లు ఇవ్వకుండా ఖమ్మంకి తీసుకెళ్లటం బాధగా ఉందన్నారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా.. ఎవరు ఎటువంటి రాజకీయాలు చేసినా నెలాఖరుకు మారేళ్లపాడు ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.



## దేశంలో ఎక్కడా సన్నబియ్యం పంపిణీ లేదు

**89 లక్షల కార్డులను 2.80 కోట్లకు చేర్చాం**
**బిఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారాలు మానాలు**
**సంగారెడ్డి సభలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**సంగారెడ్డి, ఆగస్ట్15(జై భీమ్ న్యూస్) :**

తెలంగాణలో ఇస్తున్నట్టు దేశంలో ఎక్కాడా కూడా సన్నబియ్యం పంపిణీ జరగడం లేదని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సంగారెడ్డిలో నిర్వహించిన కొత్త స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. 3.42 కోట్ల మందికి రూ.14800 కోట్లతో సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో 89 లక్షల రేషన్ కార్డులు ఉంటే.. వాటిని 2.80 కోట్లకు పెంచామని తెలిపారు. రేషన్ కార్డుల మంజూరు.. నిరంతర పక్రియ అని స్పష్టం చేశారు. బిఆర్ఎస్ పార్టీలోని నేతలు పదే పదే అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. మేడిగడ్డ, సుందిళ్ల నుంచి చుక్క నీరు తీసుకోకుండా దేశంలోనే ఎక్కువ ధాన్యాన్ని తెలంగాణలో పండించామన్నారు. వరి కొనుగోళ్లలో రూ.90 వేల కోట్లు.. రైతుల ఖాతాల్లో వేశామని అన్నారు. ఈరోజు సంగారెడ్డి చరిత్రలోనే కాదు, తెలంగాణ చరిత్రలోనే ప్రత్యేకమైన రోజుగా నిలిచిపోనుందన్నారు. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత పదేళ్లు అధికారంలో ఉన్నవాళ్లు రేషన్ కార్డులు ఇవ్వలేదని మంత్రి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నిరుపేదలకు రేషన్ కార్డుల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చిందని వెల్లడించారు. కొత్తగా 16 లక్షల మందికి రేషన్ కార్డులు ఇచ్చామని అన్నారు. ఃఖా హయాంలో రేషన్ కింద దొడ్డు బియ్యం ఇచ్చారని.. అప్పుడు ఆ బియ్యాన్ని ఎవరూ తినకుండా కిలో రూ.10కి అమ్ముకునే వారని తెలిపారు. కాంగ్రెస్ వచ్చాక సన్న వడ్లకి రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేసి వాటినే పంపిణీ చేస్తున్నామని చెప్పారు. నాణ్యత ఉన్న సన్న బియ్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేస్తోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈ రోజు చరిత్రలో పండుగలా గుర్తుండిపోతుంది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత వచ్చిన ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 16 లక్షల కొత్త కార్డులు ఇచ్చాం. గతంలో రేషన్‌లో దొడ్డు బియ్యం వచ్చేవి. ఆ బియ్యాన్ని 80 శాతం మంది తినేవారు కాదు. కానీ, కాంగ్రెస్ సర్కార్ వచ్చాక సన్నబియ్యానికి రూ.500 బోనస్ ఇచ్చి కొంటున్నాం. మనిషికి ఆరు కిలోల చొప్పున ఉచితంగా సన్న బియ్యం ఇస్తున్నాం. దేశంలో మరే రాష్ట్రంలోనూ సన్నబియ్యం ఇవ్వడం లేదు. కొత్తగా దరఖాస్తు చేసుకున్నవారి అర్హతలను పరిశీలించి కార్డులు ఇస్తాం అని ఉత్తమ్ తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డు అంటే కుటుంబానికి గౌరవమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. స్మార్ట్ రేషన్ కార్డు అంటే ఆహార భద్రత, ప్రభుత్వం ఇచ్చే ఒక గుర్తింపు అని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని పథకాలు ఇక్కడ అమలు చేస్తున్నామని, నియోజకవర్గానికి మూడు వేల ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామని చెప్పారు.

## ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడి

**పాడైన ఆహార పదార్థాల తయారీ గుర్తింపు**

**రంగారెడ్డి, ఆగస్ట్15(జై భీమ్ న్యూస్) :**

కల్తీ ఆహార తయారీ కేంద్రంపై హెచ్‌ఫాస్ట్, జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా దాడులు చేశారు. జిల్లాలోని బొంగుళూర్‌లో ఫుడ్ ప్రొడక్ట్స్‌పై జరిపిన తనిఖీల్లో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. గడువు ముగిసిన ముడిసరుకులతో ఆహార పదార్థాలను తయారు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. లేబుల్స్ లేని రసాయన సువాసన ద్రవ్యాలతో నాసిరకం ఆహారాన్ని తయారు చేస్తునట్టు తేలింది. నిర్వాహకులు అత్యంత అపరిశుభ్ర వాతావరణంలో ఆహార పదార్థాలను తయారీ చేస్తున్నట్లు అధికారుల దాడుల్లో బయటపడింది. వ్యాపారంలో లాభాలు రాకపోవడంతో ఈజీ మనీ కోసం అక్రమంగా నాణ్యత లేని ఆహారపదార్థాల తయారీకి ప్లాన్ చేసినట్లు గుర్తించిన అధికారులు.. తనిఖీల అనంతరం యజమాని మహ్మద్ ఖాలీద్, మేనేజర్ సంతోష్ కుమార్‌ను అరెస్ట్ చేశారు. ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడుల్లో దాదాపు 4.07 లక్షల విలువైన ఆహార పదార్థాలు, ముడిసరుకును స్వాధీనం చేసుకున్నారు. ముడిసరుకు గడువు ముగిసిన ఫ్లేవర్లు, కాజూ, కొబ్బరి పొడి తదితర పదార్థాలను సీజ్ చేసిన అధికారులు.. నిందితులపై ఆదిభట్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

## శ్రీరాములపల్లిలో ఆదర్శవంతమైన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**జెండా ఆవిష్కరించిన పెద్దమనుషులెవరు..?**
**మహనీయులకన్నా మనోళ్లే గొప్పోళ్లా..?**
**మహనీయులకు అవమానం.. మనోళ్లకు గొప్పతనం..!**
**విమర్శలు గుప్పిస్తున్న గ్రామస్తులు**



**కమలాపూర్, 15 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

హన్మకొండ జిల్లా కమలాపూర్ మండలం శ్రీరాములపల్లి గ్రామంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు తీవ్ర చర్చకు, విమర్శలకు దారితీశాయి. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన స్వాతంత్ర్య సమరయోధులు, మహనీయులను స్మరించుకుంటూ దేశభక్తి స్ఫూర్తిని చాటాల్సిన పవిత్రమైన రోజున స్థానికంగా చోటుచేసుకున్న పరిణామాలపై పలువురు గ్రామస్తులు తీవ్ర అసంతృప్తి, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖస్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఎవరు ఆవిష్కరించారు? ఎవరిని జెండా ఆవిష్కరణకు ఎంపిక చేశారు? ఏ ప్రాతిపదికన వారిని ఎంపిక చేశారు? గ్రామానికి, సమాజానికి సేవ చేసిన వారికి, మహనీయుల త్యాగాలను స్మరించుకునే వారికి తగిన ప్రాధాన్యత, గౌరవం లభించిందా? అనే ప్రశ్నలు ప్రస్తుతం గ్రామంలో చర్చనీయాంశంగా మారాయి. జాతీయ జెండా ఆవిష్కరణ అనేది కేవలం ఒక కార్యక్రమం కాదని, అది దేశ స్వాతంత్ర్యానికి, జాతీయ గౌరవానికి ప్రతీకగా నిలిచే పవిత్రమైన కార్యక్రమమని గ్రామస్తులు పేర్కొంటున్నారు. దేశం కోసం జీవితాలను త్యాగం చేసిన మహనీయులను స్మరించాల్సిన రోజున వారి త్యాగాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వకుండా స్థానికంగా కొందరికి వ్యక్తిగత ప్రాధాన్యత కల్పించడం సరికాదని పలువురు గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. "మహనీయులకన్నా మనోళ్లే గొప్పోళ్లా?" అంటూ వారు ప్రశ్నిస్తున్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగానే నేడు దేశ ప్రజలు స్వేచ్ఛగా జీవిస్తున్నారని, అలాంటి మహనీయులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వారు గుర్తుచేస్తున్నారు. మహనీయులకు గౌరవం ఇవ్వాల్సిన సందర్భంలో వారికి తగిన గౌరవం దక్కకపోవడం బాధాకరమని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "మహనీయులకు అవమానం.. మనోళ్లకు గొప్పతనం" అనే భావనకు తావిచ్చేలా కార్యక్రమాలు నిర్వహించడం జాతీయ పర్వదినం యొక్క అసలు స్ఫూర్తికి విరుద్ధమని వారు పేర్కొంటున్నారు. మహనీయుల త్యాగాలను గుర్తు చేసుకోవాల్సిన రోజున వ్యక్తిగత ప్రాధాన్యతలకు పెద్దపీట వేయడం వల్ల గ్రామంలో అసంతృప్తి నెలకొందని వారు అంటున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం ఏ ఒక్క వ్యక్తికి, వర్గానికి లేదా రాజకీయ పార్టీకి సంబంధించిన కార్యక్రమం కాదని, యావత్ దేశానికి సంబంధించిన జాతీయ పర్వదినమని గ్రామస్తులు స్పష్టం చేస్తున్నారు. గ్రామంలో నిర్వహించే జాతీయ పర్వదిన వేడుకలు రాజకీయాలకు, వ్యక్తిగత ప్రతిష్ఠలకు అతీతంగా ఉండాలని, అన్ని వర్గాల ప్రజలను సమన్వయం చేసుకుని నిర్వహించాలని కోరుతున్నారు. జాతీయ జెండా, జాతీయ గీతం, స్వాతంత్ర్య సమరయోధులు, మహనీయుల త్యాగాలకు అత్యున్నత గౌరవం కల్పించడం కార్యక్రమ నిర్వాహకుల ప్రాథమిక బాధ్యతగా ఉండాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా యువత, విద్యార్థులకు స్వాతంత్ర్య సమరయోధుల చరిత్ర, వారి త్యాగాలు, దేశం కోసం వారు చేసిన పోరాటాలను తెలియజేసే విధంగా కార్యక్రమాలు నిర్వహించాలని గ్రామస్తులు సూచిస్తున్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా భావితరాల్లో దేశభక్తి, జాతీయ భావం, సామాజిక ఐక్యత పెంపొందుతుందని వారు పేర్కొంటున్నారు. జాతీయ పర్వదినాలను వ్యక్తిగత ఆధిపత్యం, వర్గపోరు, రాజకీయ ప్రాధాన్యతలకు వేదికగా మార్చకుండా గ్రామ ఐక్యత, దేశభక్తి, జాతీయ సమైక్యతకు ప్రతీకగా నిర్వహించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇకనైనా శ్రీరాములపల్లి గ్రామంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అన్ని వర్గాలను కలుపుకొని, పారదర్శకంగా, మహనీయుల త్యాగాలను ముందుకు తెచ్చే విధంగా నిర్వహించాలని గ్రామస్తులు కోరుతున్నారు. జాతీయ జెండా ఆవిష్కరణ వంటి పవిత్రమైన కార్యక్రమాల్లో వ్యక్తిగత ప్రతిష్ఠలకు కాకుండా జాతీయ గౌరవానికి, మహనీయుల త్యాగాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచిస్తున్నారు. మహనీయుల త్యాగాలను గౌరవించడం, జాతీయ జెండా గౌరవాన్ని కాపాడటం, స్వాతంత్ర్య స్ఫూర్తిని భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత. కార్యక్రమ నిర్వాహకులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు వ్యక్తిగత విభేదాలకు అతీతంగా వ్యవహరిస్తూ మహనీయులకు సముచిత గౌరవం కల్పించాలని, శ్రీరాములపల్లి గ్రామ ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ జాతీయ పర్వదినాల స్ఫూర్తిని కొనసాగించాలని గ్రామస్తులు పేర్కొన్నారు.

## స్మార్ట్ కార్డుల పంపిణీలో గందరగోళం

**బిజెపి నినాదాలతో ఉద్రిక్తత**

**ఆదిలాబాద్, ఆగస్ట్15(జై భీమ్ న్యూస్) :**

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ ఉద్రిక్తత పరిస్థితులకు దారితీసింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ తో పాటు జిల్లా ఎమ్మెల్యేలు పాయల్ శంకర్ , అనిల్ జాదవ్, వెడ్మ బొజ్జ కార్యక్రమంలో పాల్గొన్నారు. రేషన్ కార్డుపై ప్రధాని ఫోటో ముద్రించాలంటూ బీజేపీ కార్యకర్తలు నినాదాలు చేయగా అక్కడే ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలు సైతం నినాదాలు చేయడంతో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. దీంతో కార్యక్రమం మధ్యలోనే నిలిచిపోయింది . రేషన్ బియ్యం పంపిణీలో అధిక వాట కేంద్ర ప్రభుత్వానిదేనని, తప్పనిసరిగా ప్రధాని మోదీ ఫోటోను ముద్రించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. పోలీసులు బీజేపీ కార్యకర్తలను అదుపులోకి తీసుకోవడంతో స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ సూచనల మేరకు వారిని విడిచి పెట్టడంతో వివాదం సద్దుమణిగింది. తిరిగి ఈ కార్యక్రమాన్ని అధికారులు కొనసాగించారు.